
జనసేన పార్టీలో చేరుతున్నారనే ప్రచారంపై మంచు క్లారిటీ

8 లో..

తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
# కబురు
KABURU TELUGU DAILY

ఇదండీ..కబురు..



హైడ్రాలో కూల్చేయగా మిగిలిన ఇండ్లకు తమ పార్టీ రంగులేసుకుంటున్నారు!


సంపుటి : 23 సంచిక : 06 | బుధవారం డిసెంబర్ 18 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | వెల-5

# వాదప్రతివాదాలతో దద్దరిల్లిన శాసనసభ

## భట్టి విక్రమార్క, హరీశ్‌రావుల సవాళ్లు, ప్రతిసవాళ్లు

### అప్పులపై అమీతుమీ!

- ఏడాదిలోనే ప్రభుత్వం రూ.1.27 లక్షల కోట్ల అప్పు తీసుకుందని హరీశ్ ధ్వజం
- దీనిపై సభలో సమగ్రంగా చర్చించాలని డిమాండ్
- ఆయన వాదనలను తోసిపుచ్చిన భట్టి
- రూ.52 వేల కోట్ల రుణమే తీసుకున్నామని వెల్లడి



కబురు, హైదరాబాద్ డిసెంబర్ 17

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డును 30 ఏళ్లకు భారాస హయాంలో లీజుకు ఇచ్చి సొమ్ము చేసుకున్నారు. వారి తరహాలోనే మేం కూడా కమర్షియల్ ట్యాక్స్ వసూళ్లను, మరికొన్నింటిని 30 సంవత్సరాలకు అదానీ, అంబానీలకు అప్పగిస్తే తర్వాత వచ్చే ప్రభుత్వాలు ఎలా మనుగడ సాగిస్తాయి? ప్రజలు ఎన్నిసార్లు తిరస్కరించినా వారిలో మార్పు రావడం లేదు. అప్పులు, ఆస్తుల విషయంలో చర్చించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. హరీశ్‌రావు సవాల్‌ను స్వీకరిస్తున్నాను.

### శాసనసభలో భట్టి విక్రమార్క

రాష్ట్ర అప్పులు, పెండింగు బిల్లులపై శాసనసభలో మంగళవారం ఆర్థికశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, భారాస సభ్యుడు హరీశ్‌రావుల మధ్య వాడీవేడీ చర్చ నడిచింది. సవాళ్లు, ప్రతి సవాళ్లతో శాసనసభ దద్దరిల్లింది. రాష్ట్రంలో ఎఫ్ఆర్‌బీఎం, దాని కిందికి రాని రుణాల స్థితిపై భారాస సభ్యులు అడిగిన ప్రశ్నపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాదప్రతివాదాలు చోటుచేసుకున్నాయి. అప్పులతో పాటు బీఏసీ సమావేశానికి సంబంధించిన అంశాలు, సభాహక్కుల ఉల్లంఘన తీర్మానం, ఉచిత విద్యుత్ తదితర అంశాలపై మాటల యుద్ధం నడిచింది. హరీశ్‌రావు, ఇతర సభ్యుల ప్రశ్నలను సభాపతి చదువుతున్న సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సభలో లేరు. దీనిపై మాజీ మంత్రి హరీశ్‌రావు లేచి నిరసన తెలిపారు. 'గత 21 ఏళ్లుగా నేను సభలో ఉన్నాను. మంత్రిగా పనిచేశాను. ప్రతిపక్షంలో ఉన్నాను. స్పీకర్ ప్రశ్న చదివినప్పుడు మంత్రి సీట్లో లేకపోయిన సందర్భం ఇదొక్కటే.సభలో ప్రశ్నోత్తరాలు ఉన్నప్పుడు భట్టివిక్రమార్క లేకపోవడం దురదృష్టకరం" అని పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ కేసీఆర్ ఎక్కడని ప్రశ్నించారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయవద్దని, భట్టి వస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.

మిగతాది 2లో



లగచర్ల ఘటనపై చర్చకు విపక్షాల పట్టు..

## నిరసనల మధ్య 3 బిల్లులకు ఆమోదం

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 17

తెలంగాణ శాసనసభ సమావేశాలు విపక్షాల నిరసనల మధ్య కొనసాగుతున్నాయి. వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనపై అసెంబ్లీలో చర్చించాలని విపక్షాలు పట్టుబట్టాయి. వాయిదా తీర్మానాల కోసం భారాస, భాజపా డిమాండ్ చేశాయి. భారాస, భాజపా సభ్యుల నిరసనల మధ్యే శాసనసభ మూడు కీలక బిల్లులను ఆమోదించింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీ బిల్లు, విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లులకు ఆమోదం లభించింది. ఎలాంటి చర్చ లేకుండానే ఈ మూడు బిల్లులకు సభ ఆమోదం తెలపడం గమనార్హం. రాష్ట్ర పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ అనంతరం సభ బుధవారానికి వాయిదా పడింది.




## ఇతర రాష్ట్రాల్లో మెడిసిన్ చదివిన వారిని స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు ఆదేశం

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 17

మెడికల్ పీజీ అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. తెలంగాణ స్థానికత ఉండి ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ చదవినా, తెలంగాణ స్థానికత లేకుండా ఇక్కడ ఎంబీబీఎస్, బీడీఎస్ చదవిన వారిని కూడా స్థానికులుగా పరిగణించాలని ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది.

02



## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే ఎంఐఎం ఊరుకోదు

- ఆందోళన చేయటానికి సిద్ధంగా ఉన్నాం

– అక్బరుద్దీన్ ఓవైసీ

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 17

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోతే ఎంఐఎం ఊరుకోదు అని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ హెచ్చరించారు.

2 లో

# గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రూ. 5197 కోట్ల బకాయిలు.. ఫీజు

### రియంబర్స్ మెంట్ బకాయిలపై మంత్రి సీతక్క



కబురు, హైదరాబాద్ డిసెంబర్ 17

విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను క్లియర్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే చెప్పారని.. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి సీతక్క మండలిలో ప్రకటించారు. కాగా బీఆర్ఎస్ పాలనలో గత ఐదేళ్లలో 2019-20 లో 40 కోట్లు, 2020- -21 లో 209 కోట్లు, 2021- -22 లో 981 కోట్లు, 2022- -23 లో 2120 కోట్లు, 2023- -24 లో 1845 కోట్లు.. మొత్తం రూ. 5197 కోట్ల మేర ఫీజు బకాయిలు పేరుకుపోయాయని వివరించారు.

మిగతాది 2లో

## హైడ్రా కూల్చివేతలపై కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు



కబురు, హైదరాబాద్ డిసెంబర్ 17

కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జులై తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పడక ముందు ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లబోమన్నారు. "గతంలో పర్మిషన్ తీసుకొని ఇప్పుడు నిర్మిస్తున్న నిర్మాణాల వైపు వెళ్లం. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వాటి కూల్చివేతలు తప్పదు. కొత్తగా తీసుకున్న అనుమతులను హైడ్రా పరిశీలిస్తుంది. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చెరువుల పరిరక్షణకు పనిచేస్తున్నాం. పేదల జోలికి హైడ్రా రాదు. వారి ఇళ్లను కూల్చివేస్తున్నామనే తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు" అని రంగనాథ్ కోరారు.



## ఇళ్లు కూల్చారు సరే... మరి ఇఎంఐలు ఎవరు కడతారు..? :

– కొద్దిగా మానవత్వాన్ని చాటుకోండి

– ఎమ్మెల్సీ కవిత

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 17

కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొట్టిన ఇండ్లకు బ్యాంకు నుంచి అప్పులకు ఇఎంఐలు ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి కడతాడా అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. మూసీ అభివృద్ధి కోసం మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా డీపీఆర్ చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు శాసనమండలిలో ప్రస్తావించగా.. ఎమ్మెల్సీ కవిత పలు అంశాలపై ప్రశ్నలు సంధించారు. మూసీ నది విషయంలో డీపీఆర్ ఆధారంగా అంచనా వ్యయాలు ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. కానీ రూ. 4100 కోట్లు కావాలని ప్రపంచ బ్యాంకును ప్రభుత్వ ఆశ్రయించినట్లు మాకు నిర్దిష్టమైన సమాచారం ఉంది. ప్రపంచ బ్యాంకును ప్రభుత్వం ఆశ్రయించిన విషయం వాస్తవమా కాదా..? డీపీఆర్ తయారు కాలేదని ప్రభుత్వం ఈ రోజు సభకు చెప్పింది. ఏ తేదీన ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సాయం కోరుతూ ప్రతిపాదనలు పంపించింది.

02

తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే ఎంఐఎం ఊరుకోదు

మొదటిపేజీ తరువాయి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని బకాయిలను బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించింది. బీఆర్ఎస్ పెట్టిన బకాయిలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించాల్సిందే అని ఓవైసీ డిమాండ్ చేశారు. శాసనసభలో జీరో అవర్ సందర్భంగా ఎమ్మెల్యే ఓవైసీ ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని ప్రస్తావించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, కాలేజీల యాజమాన్యాలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నిధుల విడుదల చేయకపోవడంతో 7 లక్షల మంది విద్యార్థులు ప్రతి ఏడాది నష్టపోతున్నారు. ఈ నిధులు విడుదల కాకపో వడంతో విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. విద్యార్థుల వద్ద ఫీజులు వసూలు చేసి కాలేజీలు నడుపుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఆగిపోవడం కారణంగా.. 20 లక్షల మంది విద్యార్థులు తీవ్రంగా బాధపడుతున్నారు. 4 లక్షల మంది టీచింగ్ స్టాఫ్ సమయానికి జీతాలు పొందలేకపోతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం మరిచిపోవద్దు అని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఆగిపోవడంతో చాలా కాలేజీలు మూతపడుతున్నాయి. ఏడాది కాలం నుంచి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు కూడా విడుదల చేయడం లేదు. ఇది బర్నింగ్ ఇష్యూ. దయచేసి అడుగుతున్నా.. సగంలో సగం అయినా నిధులు విడుదల చేయాలి. విద్యార్థుల జీవితాలతో ఎందుకు ఆడుకుంటున్నారు. ఏదో నోట్ చేసుకుంటున్నాం.. అని మంత్రులు చెప్పొద్దు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోవద్దు. తప్పకుండా నిధులు విడుదల చేయండి. ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించడం ప్రభుత్వాల బాధ్యత. నిధులు విడుదల చేయకపోతే ఎంఐఎం పార్టీ ఆందోళనలు చేపడుతుంది. నిరసనలు వ్యక్తం చేస్తాం. అన్ని పార్టీలు మద్దతు పలకాల్సిన అవసరం ఉంది అని ఎమ్మెల్యే ఓవైసీ కోరారు. ఇక ఇదే అంశంపై మాట్లాడేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రయత్నించగా, స్పీకర్ మైక్ ఇవ్వలేదు.

## సంపాదకీయం

# చర్చ జరగాలి కానీ, ఇలాగా..?



పార్లమెంట్ శీతకాల సమావేశాలు ఈ సోమవారంతో ఆఖరి వారం వ్యవధిలోకి ప్రవేశించాయి. దేశంలో చలి పెరుగుతుంటే, సభలో వాతావరణం మాత్రం వేగంగా వేడెక్కుతోంది. మొన్న నవంబర్ 26న 75 వసంతాలు పూర్తి చేసుకున్న భారత రాజ్యాంగం అమలుపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శల పర్వం చూస్తే ఆ భావనే కలుగుతుంది. లోక్‌సభలో గత శుక్ర, శనివారాలు రాజ్యాంగ చర్చ జరిగితే, ఈ సోమ, మంగళవారాలు రాజ్యసభలో అది కొనసాగుతోంది.'ఒకే దేశం... ఒకే ఎన్నిక' బిల్లుకు కావాల్సిన రాజ్యాంగ సవరణ మాట అటుంచితే, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కాక గాంధీల కుటుంబ శ్రేయానికై కాంగ్రెస్ నిస్సిగ్గుగా రాజ్యాంగాన్ని సవరిస్తూ పోయిందని ఆర్థిక మంత్రి ఆరోపించడం తాజాగా అగ్గి రాజేసింది. అనేక జటిల సమస్యలకు రాజ్యాంగ సవరణలే ఏకైక పరిష్కారం అంటూ నెహ్రూకు సాక్షాత్తూ సర్దార్ పటేలే లేఖ రాశారంటూ రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తిప్పికొట్టాల్సి వచ్చింది. వెరసి, భారత గణతంత్రానికి ఆత్మ లాంటి రాజ్యాంగంపై చర్చ పక్కదోవ పట్టి, పార్టీలు బురదజల్లుకొనే ప్రక్రియగా మారిపోయింది.నిజానికి, స్వాతంత్ర్యానంతరం భారతదేశ భవితవ్యమెలా ఉంటుందన్న దానిపై బోలెడన్ని అనుమానాలు, జోస్యాలు వెలువడినా, మన రాజ్యాంగం పటాపంచలు చేసింది. నిజానికి, నవ యువ గణతంత్ర రాజ్యంగా మనం అనేక ఒడుదొడుకులను ఎదుర్కొన్నాం. వాటన్నిటినీ తట్టుకొని నిలవడంలోనూ విజయవంతమయ్యాం. భారత రాజ్యాంగం కాలపరీక్షకు నిలిచి, దేశానికి మూలస్తంభంగా నిలిచింది. ఇవాళ అనేక దేశాల్లో, చివరకు సోకాల్డ్ ప్రజాస్వామ్యాల్లోనూ అధికార బదలాయింపులో పలు సమస్యలను ఎదుర్కొంటున్నా, భారత్‌లో మాత్రం ప్రజాభీష్టాన్ని ప్రతిఫలించే అధికార బదలీ శాంతియుతంగా సాగిపోవడం మన రాజ్యాంగం వేసిన పటిష్ఠమైన పునాదికీ, చూపిన ఆచరణాత్మకమైన మార్గానికీ తార్కాణం. ఈ ఏడున్నర దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో వేర్వేరు రాజకీయ పార్టీలు, కూటములు దేశాన్ని పాలించాయి. 1975లో ఎమర్జెన్సీ విధింపు లాంటి అశనిపాతాలు అడపాదడపా ఎదురైనా, ప్రభుత్వాలన్నీ దేశాన్ని ముందుకే నడిపాయి. క్రియాశీలక సజీవపత్రంగా రాజ్యాంగ రూపకర్తలు సంభావించిన భారత రాజ్యాంగం అంతర్గత సంకల్పబలం, స్థితిస్థాపక చైతన్యంతో నవ భారత అవసరాలకు తగ్గట్టుగా మార్పులతో నిత్య నూతనంగా నిలుస్తూ వచ్చింది. దానికి తగ్గట్టే రాజ్యాంగాన్ని ఇప్పటికి శతాధిక పర్యాయాలు సవరించడం జరిగింది. దేశ సామాజిక, ఆర్థిక ప్రయోజనాలకు తగ్గట్టు దేశం ముందుకు పోయేందుకు అనేక ఏళ్ళుగా భారత రాజ్యాంగం వీలు కల్పిస్తూనే వచ్చింది. అనేక పార్శ్వాలున్న ఈ రాజ్యాంగ ప్రస్థానాన్ని పార్లమెంట్‌లో చర్చిస్తున్నారంటే, భవిష్యత్తుపై దృష్టి సారిస్తారని భావించాం. రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదర్శాలు, లక్ష్యాలు సాకారమయ్యేందుకు పథ నిర్దేశం జరుగుతుందని ఆశించాం. భారత స్వాతంత్ర్య శతవర్ష సమారోహం సాగే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎలా తీర్చిదిద్దాలన్న దానిపై మేధా మథనం జరపాలని ఆకాంక్షించాం. ఆ దిశలో సామాన్యుల జీవితాలు మెరుగయ్యేలా లక్షించాల్సింది పోయి విమర్శల పర్వానికే చర్చ పరిమితమైపోవడం శోచనీయం. నిజానికి, ఎవరూ విమర్శలకు అతీతులు కారు. గాంధీ, నెహ్రూలైనా అంతే. వారిని విమర్శించ దలుచుకుంటే నేరుగా విమర్శించవచ్చు. అంతేకానీ, రాజ్యాంగంపై చర్చ పేరిట పరోక్షంగా కొంద రిపై బురద జల్లడం ఏమిటన్నది ఒక వాదన. తాజా చర్చ సందర్భంలో అధికార ఎన్డీఏ వర్గీయులు ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగ నిర్మాతల లక్ష్యాలను తప్పుబడుతున్నారని కూడా ఆరోపణ. అయితే, అసలు భావప్రకటనా స్వేచ్ఛపై సహేతుకమైన పరిమితులు పెట్టవచ్చంటూ తొలి రాజ్యాంగ సవరణ తెచ్చింది కాంగ్రెసే అని బీజేపీ ఎత్తిచూపుతోంది. స్వేచ్ఛ ఉండాలి నిజమే కానీ, అన్ని సమయాల్లోనూ అది నిర్నిబంధమైతే కష్టం గనక సహేతుకమైన పరిమితులు విధించవచ్చని అలా ప్రథమ సవరణతో రాజ్యాంగ రూపకర్తలే దిద్దుబాటు బాట పట్టారన్నది కాంగ్రెస్ వర్గీయుల ప్రతివాదన. రాజ్యాంగ అమలుకు అమృతోత్సవ వేళ చర్చ దాని అమలు తీరుతెన్నులు, భవిష్యత్ సవాళ్ళపైనే సాగాల్సింది. సామూహిక ఆత్మపరిశీలనకు దీన్ని అవకాశంగా మలుచుకోవాల్సింది. కానీ, జరుగుతున్నది వేరు. చర్చంతా రాజకీయ రంగు పులుముకొని, నెహ్రూ కుటుంబం, ఎమర్జెన్సీ, మోదీ సర్కార్ చుట్టూ సాగుతోంది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో అవిశ్వాస తీర్మానంపై చర్చ ఫక్కీలోకి జారిపోయింది.1975 ఎమర్జెన్సీలోనైనా, ఇప్పుడు 'అప్రకటిత ఎమర్జెన్సీ' ఉందంటున్నా... రెండు సందర్భాల్లో పాలకుల చేతిలో నలిగిపోయింది రాజ్యాంగానికి గుండె లాంటి పౌరుల ప్రాథమిక హక్కులే అని విస్మరించరాదు. ఏళ్ళు గడుస్తున్నకొద్దీ సవాళ్ళు అధికరిస్తున్నాయి. లౌకికవాదం, సమాఖ్య వాదం, న్యాయవ్యవస్థ స్వతంత్రత, దుర్విచక్షణ లేకపోవడం, మైనారిటీల హక్కుల పరిరక్షణ లాంటి రాజ్యాంగ మౌలిక సూత్రాలపైనే ప్రశ్నార్థకాలు పొడసూపుతున్నాయి. సమాన అవకాశాల మాట దేవుడెరుగు, ఆర్థికంగా%-% సామాజికంగా%-% లింగపరంగా సమానత్వం సైతం నేటికీ పూజ్యం. అంత రాలు పెరుగుతున్న సమాజంలో అసమానతల నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామా? అన్ని పక్షాలూ ఆత్మావలోకనం చేసుకోవాలి. రాజకీయ పత్రం, దేశ రాజకీయాలకు పునాది అయినప్పటికీ, రాజ్యాంగమనేది అదే సమయంలో రాజకీయాలకు అతీతమైనది. దానిపై చర్చలో ప్రధాని సహా అందరూ సంకుచిత రాజకీయాలకే చోటిస్తే ఇంకేమనాలి? ఈ ధోరణి మారాలి. రాజ్యాంగం ఇన్నేళ్ళుగా జాతికి దిక్సూచిగా నిలిచింది. ప్రభుతకూ, పౌరులకూ ప్రజాస్వామ్య ఫర్మానాగా వెలిగింది. ఆ ఉజ్జ్వల స్ఫూర్తికి కట్టుబడడమే సమస్త సమస్యలకూ పరిష్కారం. సామాన్యుల హక్కులకు శ్రీరామరక్ష.

# వాదప్రతివాదాలతో దద్దరిల్లిన శాసనసభ

మొదటిపేజీ తరువాయి

ఇంతలో భట్టివిక్రమార్క రావడంతో ప్రశ్నోత్తరాలు మొదలయ్యాయి. భట్టి మాట్లాడుతూ.. "గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది నవంబరు వరకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన రుణాలు రూ.51,277.71 కోట్లు కాగా.. డ్రా చేసినవి రూ.51,891.44 కోట్లు. 2023 డిసెంబరు నుంచి 2024 నవంబరు 30 వరకు డ్రా చేసిన ఎఫ్ఆర్‌బీఎం రుణాలు రూ.52,118 కోట్లు. ఇదే సమయంలో కార్పొరేషన్లు, ఎస్పీవీలు డ్రా చేసిన ఎఫ్ఆర్‌బీఎంయేతర రుణాలు రూ.61,991.14 కోట్లు" అని వివరించారు.

**ఏడాదిలోనే రూ.1.27 లక్షల కోట్ల అప్పు: హరీశ్‌రావు**

సభ్యులు అడిగిన ప్రశ్నకు భట్టి సమాధానం ఇచ్చిన అనంతరం హరీశ్‌రావు మాట్లాడారు. "రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం కింద తీసుకున్న అప్పులు రూ.51,277 కోట్లు. ఈరోజు ఉదయం ఆర్బీఐ నివేదిక తీసుకున్నాను. ఈరోజు వరకు కలిపితే ఇంకో రూ.4 వేల కోట్లు పెరిగింది. అంటే ఎఫ్ఆర్‌బీఎం కింద రూ.55,277 కోట్లు తీసుకున్నట్లు నివేదికలో ఉంది. కార్పొరేషన్ గ్యారంటీల కింద రూ.61,991 కోట్లు తీసుకున్నారు. మరో రూ.10,099 కోట్లు గ్యారంటీలు లేకుండా తీసుకున్నారు. మొత్తంగా ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అప్పు రూ.1,27,367 కోట్లు. ఇలాగే కొనసాగితే ఐదేళ్లలో రూ.6,36,835 కోట్లవుతుంది. భారాస హయాంలో చేసిన మొత్తం అప్పు రూ.4,17,496 కోట్లు మాత్రమే. భారాస పాలనపై కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో విడుదల చేసిన శ్వేతపత్రంలో రూ.6,71,757 కోట్లు తీసుకున్నారని పేర్కొన్నారు. బహిరంగ సభల్లో ముఖ్యమంత్రి, మంత్రులు రూ.7 లక్షల కోట్లని అంటున్నారు. ఈరోజు మీరు రూ.7,11,911 కోట్ల అప్పు చేశారని అన్నారు. గోరంతను కొండంత చేసి గోబెల్స్ ప్రచారం చేస్తూ అవాస్తవాలు చెప్పారు. నేను సభలో సవాల్ చేస్తున్నా. దీనిపై సమగ్రంగా చర్చించాలి. మా హయాంలో తెచ్చిన అప్పులతో అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాం. మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని అందించాం. భారాస ప్రభుత్వం ఆస్తులను సృష్టించింది. కానీ, కాంగ్రెస్ ఏడాదిలోనే రూ.1.27 లక్షల కోట్ల అప్పు తెచ్చింది. ఇవి ఆర్బీఐ ప్రకటించిన లెక్కలు. ఇంత అప్పు తెచ్చి ఏం చేశారో చెప్పలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఆరు గ్యారంటీలు సహా ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. అప్పులు చేసి.. కమీషన్లు పంచుకున్నారు. పైగా గత ప్రభుత్వం చేసిన అప్పులంటూ దుష్ప్రచారం చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర అప్పులపై గత శాసనసభ సమావేశాల్లో తప్పుడు లెక్కలు ఇచ్చి అసెంబ్లీని తప్పుదోవ పట్టించారని మేం సభాహక్కుల తీర్మానం ఇచ్చాం. దీనిపై చర్చకు అనుమతించాలి" అని హరీశ్‌రావు అన్నారు.

**ఏడాదిలో మేం చేసిన అప్పు రూ.52 వేల కోట్లే: భట్టి**

హరీశ్‌రావు మాట్లాడిన తర్వాత దానిపై భట్టివిక్రమార్క స్పందించారు. "మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.లక్ష కోట్లు అప్పు చేసిందని విపక్షాలు చేసే ప్రచారంలో వాస్తవం లేదు. మేం చేసిన అప్పులు రూ.52 వేల కోట్లు మాత్రమే. భారాస హయాంలోని అప్పులకు వడ్డీ, అసలు కలిపి 11 నెలల్లో రూ.66,000 కోట్లు చెల్లించాం. భారాస సర్కారు రూ.40 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెడితే మేం ఇప్పటికే రూ.14 వేల కోట్లు చెల్లించాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధిని దాటి ఎప్పుడూ అప్పు చేయలేదు. వీలైతే తగ్గించుకుంటూ పోవాలని జాగ్రత్త తీసుకుంటున్నాం. పదేళ్లలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని ఒక సంవత్సరంలో చక్కబెట్టలేం. అందుకే కొంత అప్పు చేస్తున్నాం. భారాస పాలనలో పౌరసరఫరాల శాఖలో రూ.18 వేల కోట్ల బకాయిలు మిగిల్చారు. రైతులకు ఉచిత విద్యుత్తు కాంగ్రెస్ పేటెంట్. 2004లో మా ప్రభుత్వం ప్రారంభించింది. డిస్కంలకు ఎప్పటికప్పుడు బకాయిలు చెల్లించేది. కానీ, గత భారాస ప్రభుత్వం రూ.18 వేల కోట్ల బకాయిలు పెట్టింది. మళ్లీ మేం వచ్చాక ఎప్పటికప్పుడు బకాయిలు చెల్లిస్తున్నాం. ఇప్పటికే రూ.11 వేల కోట్లు చెల్లించాం. కాంట్రాక్టర్లకు గత పాలకులు ప్రతిఏటా పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించేవారు. కానీ వసతిగృహాల్లో ఉండే పేద విద్యార్థుల మెస్‌ఛార్జీలు మాత్రం ఒక్క రూపాయీ పెంచలేదు. సరఫరాదారులు నాసిరకం సరకులు అందించడం.. ఫలితంగా నాణ్యతలేని భోజనం ఇవ్వడంతో పిల్లలు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు.

ఈ దుస్థితిని గమనించి మెస్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్స్ ఛార్జీలను 200 శాతానికి పైగా పెంచాం. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామంటే.. నాపై భారాస సభ్యులు సభాహక్కుల తీర్మానానికి నోటీసు ఇచ్చారు. పేదలకు భృతి ఇవ్వడం తప్పా? వారికి ఇవ్వొద్దని భారాస నేతలు కోరుకుంటున్నారా? భారాస ప్రభుత్వ హయాంలో శాసనసభలో ఆ పార్టీ నేతలే రూల్స్ బుక్ తయారు చేసుకున్నారు. సోమవారం నిర్వహించిన బీఏసీ సమావేశంలో కాగితాలు పారేసిపోయారు? ఇదేం సంప్రదాయం?" అని భట్టి ప్రశ్నించారు.

ఒక్క పథకమూ అమలు కావడం లేదు: వేముల ప్రశాంత్‌రెడ్డి, భారాస ఎమ్మెల్యే

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు కావడం లేదు. చిన్న చిన్న పనులకు కూడా బిల్లులు చెల్లించడం లేదు. బాల్కొండ నియోజకవర్గంలో పలు కుల సంఘ భవనాలు, మహిళా భవనాలు, కల్యాణ మండపం, బడులు, గుడులకు బిల్లులు చెల్లించలేదు. ఇది ఒక్క బాల్కొండ నియోజకవర్గ సమస్య కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేల సమస్య. చిన్న పనుల బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి.

**రాష్ట్రాన్ని మరింత దివాలా తీయించొద్దు**

**ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, భాజపా శాసనసభాపక్ష నేత**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికీ ఎడాపెడా అప్పులు చేస్తోంది. ఏడాదిలోనే రూ.1.27 లక్షల కోట్ల అప్పులు చేసింది. 400 ఎకరాల భూమిని టీజీఐఐసీ ద్వారా బ్యాంకులో తనఖా పెట్టి అప్పులు తీసుకుంది. ఎఫ్ఆర్‌బీఎం నుంచి తప్పించుకోవడానికి ఇదో ఎత్తుగడ. ఇన్ని అప్పులు చేసినా ఆరు గ్యారంటీలు అమలు కాలేదు. మళ్లీ, మళ్లీ అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని మరింత దివాలా తీయించొద్దు. హామీల అమలు కోసం ప్రభుత్వంపై మేం అన్నివిధాలా ఒత్తిడి తెస్తాం.

# ఇళ్లు కూల్చారు సరే... మరీ ఇఎంఐలు ఎవరు కడతారు..? :

మొదటిపేజీ తరువాయి

మూసీ కోసం రూ. 14,100 కోట్ల వ్యయం అవుతుందని, నిధులతో పాటు అనుమతులు ఇప్పించాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఏ ప్రాతిపదికన అడిగారు. ఒక వేళ కేంద్రాన్ని సాయం కోరడం, ప్రపంచ బ్యాంకు సాయం కోరడం వాస్తవమైతే సభను, ప్రజలను ఎందుకు తప్పుదోవపట్టిస్తున్నారు..? సభను తప్పుదోవ పట్టిస్తే అవసరమైతే ప్రివిలేజ్ మోషన్‌ను ప్రవేశపెడుతాం అని కవిత హెచ్చరించారు. మూసీ నదిగర్భంలో నివసించే 309 కుటుంబాలు వాళ్లంతట వాళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారని ప్రభుత్వం చెబుతుందన్నారు. కానీ హృదయవిదారకమైన వీడియోలను చూస్తే ప్రభుత్వం చెబుతున్నది అవసస్తవమని స్పష్టమవుతుందని అన్నారు. ఆ 309 కుటుంబాలు సమ్మతిస్తూ ఏవైనా పత్రాలపై సంతకాలు చేసి ఉంటే అవి సభకు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 181 కుటుంబాలు తామంతట తామే కూల్చేసుకొని వెళ్లిపోయారని ప్రభుత్వం చెబుతోందని, ఇది వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉందన్నారు. మూసీ నిర్వాసితుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాలి అని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ కవిత సూచించారు.

# విద్యార్థిని కరిచిన ఎలుక.. చచ్చు పడిపోయిన కాలు, చెయ్యి

**- ఖమ్మంలో ఆలస్యంగా వెలుగులోకి వచిన ఘటన**

**- రాబిస్ వ్యాక్సిన్ వేయించాం: ఆర్ సీవో**

ఖమ్మం దానవాయిగూడెం బీసీ వెల్ఫేర్ గురుకులంలో దారుణం చోటుచేసు కుంది. గత ఫిబ్రవరిలో పదవ తరగతి చదువుతున్న సమయంలో విద్యార్థిని భవానీ కీర్తిని ఎలుక కరిచింది. ఎలుక కరిచిన తరువాత బాధిత విద్యార్థిని కాలు, చెయ్యి చచ్చుపడిపోయిన దశలో హాస్పటల్లో చికిత్స పొందుతోంది.

# ఇతర రాష్ట్రాల్లో మెడిసిన్ చదివిన వారిని స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు ఆదేశం

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 140ని సవరించాలని గతంలోనే ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ జీఓను హైకోర్టు నిలిపివేసింది.ప్రభుత్వ జీవోను సవాల్ చేస్తూ మెడికల్ పీజీ విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. జీవో 140 ప్రకారం 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదవడంతోపాటు ఎంబీబీఎస్ కూడా ఇక్కడే పూర్తి చేసినవారికి తెలంగాణ స్థానికత కల్పిస్తారు. ఈ జీవో అమలును ప్రస్తుతం హైకోర్టు నిలిపివేసింది.

# గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రూ. 5197 కోట్ల బకాయిలు.. ఫీజు ల

మొదటిపేజీ తరువాయి

చదువుకోలేని పేద పిల్లలకు చదువు భారం కాకుడదనే ఉద్దేశంతో, పేద వర్గాల పిల్లలకు కార్పోరేట్, ఉన్నత విద్యను అందించాలనే గొప్ప లక్ష్యంతో 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. ఈ పథకంతో ఎంతో మంతి పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పథకం అమలులో ఉన్నప్పటికీ.. దానిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో వేల కోట్ల బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని చెప్పుకొచ్చారు.

## కార్యకర్తకు పదివేల ఆర్థిక సాయం అందజేసిన బిజెపి నాయకులు



కబురు న్యూస్, నసురుల్లాబాద్, డిసెంబర్ 17

నసురుల్లాబాద్ మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త సాయికుమార్ గత కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలును పోగొట్టుకోవడంతో మంగళవారం మండల అధ్యక్షుడు సున్నం సాయిలు ఎన్నారై బిజెపి నాయకులు కోనేరు శశాంక్ అందజేసిన పదివేల రూపాయలను కార్యకర్తకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సున్నం సాయిలు, వడ్ల సతీష్, రాములు, శ్రీనివాసరావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహిళా కార్యదర్శిగా ఎర్ల విజయలక్ష్మి



కబురు న్యూస్, బాన్సువాడ డిసెంబర్ 17

రాష్ట్ర పద్మశాలి సంఘం మహిళా కార్యదర్శిగా బాన్సువాడ పట్టణానికి చెందిన ఎర్ల విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాదులోని హరిహర కళాభవన్ లో మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పద్మశాలీల సంఘ సభ్యుల అభివృద్ధికి అందరితో కలిసి పని చేస్తానన్నారు.

## సబ్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన నాయక్ పోడ్ సభ్యులు

కబురు న్యూస్ బాన్సువాడ, డిసెంబర్ 17



ఆదివాసి నాయక్ పోడ్ కులస్తులకు కులం ధ్రువీకరణ పత్రం అందజేయాలని కోరుతూ మంగళవారం నాయక్ సంఘ అధ్యక్షులు రామచంద్రం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పెంటయ్య, సాయిలు, సాయిబాబా, శంకర్, దుర్గయ్య, రాజు, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు పలికిన ఉపాధ్యాయులు



కబురు న్యూస్ బాన్సువాడ డిసెంబర్ 17

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న సిఆర్పిలను, సమగ్ర శిక్ష ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా పరిగణించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోనాపూర్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా అయ్యాల సంతోష్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీలకు పే స్కేల్ వేతనంతోపాటు ఆరోగ్య భీమా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్, సాయిరాం, రాధా, విజయ్, హీరలాల్ ,శ్రీనివాస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

– కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు





కబురు న్యూస్, బోధన్ డిసెంబర్ 17...

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. బోధన్ పట్టణంతో పాటు, రుద్రూర్ మండలం సులేమాన్ నగర్ లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేయర్లు ఇంటింటికీ తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్జీదారుల వివరాలను సేకరిస్తున్న తీరును పరిశీలించి, సూచనలు చేశారు. రోజుకు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారని అడిగారు. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, పొరపాట్లకు తావులేకుండా దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్ మొబైల్ యాప్ లో జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. ఈ నెలాఖరులోగా నూటికి నూరు శాతం సర్వే పూర్తి అయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన పాతకాలం నాటి ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఎవరైనా వాటి స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే, అలాంటి వారి వివరాలను కూడా పూర్తిస్థాయిలో సేకరించి సర్వే యాప్ లో పొందుపర్చాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్న దృష్ట్యా, దరఖాస్తుదారుల వివరాల నమోదులో పొరపాట్లు లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి హితవు పలికారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఏమైనా సందేహాలు ఉంటే మున్సిపాలిటీ పరిధిలో వార్డు అధికారి ని , గ్రామాల్లో ఉండే వారు పంచాయతీ కార్యదర్శి ని సంప్రదించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, రుద్రూర్ ఎంపీడీఓ సురేష్ బాబు తదితరులు ఉన్నారు.

# రైతులను నిర్భందించడం దారుణం...

– బీఆర్ఎస్ నాయకులు..






కబురు న్యూస్,బోధన్ డిసెంబర్17..

లగచర్ల రైతులను నిర్భందించడం దారుణమని బోధన్ బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించి నెల రోజుల పాటు జైల్లో నిర్బంధించిన కారణంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేస్తూ మంగళవారం బోధన్ పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. నెల రోజులుగా అక్రమ నిర్బంధం చేసి గిరిజన రైతులకు బేడీలు వేసిన రాష్ట్ర ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా లగచర్ల రైతులను బేషరతుగా విడుదల చేసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, సీనియర్ నాయకులు రజాక్, కార్మిక విభాగం అధ్యక్షులు రవిశంకర్ గౌడ్, యువజన నాయకులు భవానిపేట్ శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షులు అడ్లూరి నరేష్ కుమార్, మైనార్టీ సెల్ నాయకులు అహ్మద్, నాయకులు విద్యాసాగర్, ఎస్సీ నాయకులు సాగర్, అఖిల్, ఆషిం, నసీర్ పటేల్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలుగుబంటి దాడిలో బాలునికి గాయాలు...





కబురు న్యూస్,బోధన్ డిసెంబర్ 17..

ఎలుగుబంటి దాడిలో బాలునికి గాయాలైన ఘటన బోధన్ నియోజకవర్గం ఎడపల్లి మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి గ్రామానికి చెందిన హన్మాండ్లు కుమారుడు షష్మిత్(14) మంగళవారం ఉదయం కాలకృత్యాలకు వెళ్లిన సమయంలో ఎలుగుబంటి దాడి చేసింది. సమాచారం అందుకున్న 108అంబులెన్సు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని వైద్య చికిత్స కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినిలకు నేరాలపై అవగాహన...



కబురు న్యూస్,బోధన్ డిసెంబర్ 17..



బోధన్ డివిజన్ షీ టీమ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలపై జరిగే నేరాల గురించి, టి–సేఫ్ యాప్, డయల్ 100, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, జేజే చట్టం, సైబర్ నేరాల గురించి సిబ్బంది విజయ్, సుజాత లు కళాశాల విద్యార్థినిలకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు 150 మంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ కు వినతి పత్రం ఇచ్చిన బిఆర్ఎస్ నాయకులు

కబురు న్యూస్, బాన్సువాడ, డిసెంబర్ 17



బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు మోచి గణేష్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్లలో రైతులపై కేసులు చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నాయకులు మోచి గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని చెప్పుకుంటూ రైతులకు బేడీలు వేసి జైలుకు పంపించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తూ ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా రైతులపై నమోదు చేసిన కేసులను మాఫీ చేయాలని లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోచి గణేష్, రమేష్ యాదవ్, చాకలి సాయిలు, గౌస్, మహేష్, నర్సింలు గౌడ్, జీవన్, అనిల్,సాయిలు, లక్ష్మణ్ మొగులయ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## సావిత్రిబాయి పూలే పురస్కారాల కరపత్రాలను ఆవిష్కరించిన డిఇవో అశోక్

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,డిసెంబర్ 17 :



జనవరి 5వ తేదీన బిసిటియు ఆధ్వర్యంలో నిర్వహించే సావిత్రిబాయి పూలే పురస్కారాల కరపత్రాలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ,సావిత్రిబాయి పూలే గొప్ప సంఘసంస్కర్త అని భారత దేశ చరిత్రలోనే స్త్రీ విద్యను ప్రవేశ పెట్టిన ఘనత ఆమెది అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ ,ప్రధాన కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ,వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టాల రామకృష్ణ,అసోసియేటడ్ అధ్యక్షులు మోహన్,గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు,ఉపాధ్యక్షులు మహేందర్,మాక్లూర్ మండల బిసిటియు అధ్యక్షులు గంగోనె సంజీవ్,పిఅర్ టియు అధ్యక్షులు మోహన్ రెడ్డి,నవీపేట్ ఎం ఇ వో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్ఫార్మర్ దొంగల పట్టివేత...

**కబురు న్యూస్, బోధన్ డిసెంబర్ 17..**

బోధన్ పట్టణంలో ట్రాన్స్ఫుర్మర్ దొంగలను పట్టుకున్నట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర చారి ఆద్వర్యంలో సీసీఎస్ సిబ్బంది తో పాటు పట్టణ పోలీసులు కలిసి బోధన్ పరిసర ప్రాంతంలో జరుగుతున్న ట్రాన్స్ ఫార్మర్ ల దొంగతనాల నివారణ గురించి పట్టణ శివారు బాబ్ గార్డెన్ ఏరియాలో గస్తీ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఒక మోటార్ సైకిల్ పై ఒక బస్తాతో బోధన్ నుండి బాబా గార్డెన్ వైపు వస్తుండగా, అట్టి వ్యక్తులు పోలీస్ వారిని చూసి పారిపోవడం గమనించడం జరిగిందన్నారు. వెంటనే వారిని వెంబడించి పట్టుకొని విచారించగా సయ్యద్ మహమ్మద్ ఏ సోహెల్, షేక్ అఫ్సర్ ఇద్దరు తన స్నేహితులయిన అన్సార్ ఖాన్, షేక్ తాహెర్, మహమ్మద్ ఇమ్రాన్, షేక్ అఫ్సర్ మహమ్మద్ ఆయన్ అందరూ కలిసి ఆయాన్ యొక్క ఆటొలో, అఫ్సర్ మోటార్ సైకిల్ పై నిజామాబాద్ జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ ల పరిసర గ్రామాలలో రాత్రి సమయంలో తిరుగుతూ రోడ్ పక్కన పొలంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ లను ధ్వంసము




చేసి అందులో ఉన్న రాగి వైరుని దొంగలించి అమ్ముకొనే వారని చెప్పారని తెలిపారు. దొంగతనాలు చేస్తూ మంగళవారం పై వారి స్నేహితులు అయిన అన్సార్ ఖాన్, షేక్ తాహెర్, మహమ్మద్ ఇమ్రాన్, మహమ్మద్ ఆయన్ లు కలిసి ఆయాన్ యొక్క ఆటొ లో ట్రాన్స్ ఫార్మర్ దొంగతనం చేయడానికి రాత్రి సమయంలో మాక్లూర్ మండలములోని చిక్లి గ్రామ శివారు లో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ ను దొంగలించడానికి వెళ్లారని అక్కడ ట్రాన్స్ ఫార్మర్ కరెంట్ వైర్ లను ఆయాన్ తొలగిస్తుండగా ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్ తగిలి ఆయాన్ అక్కడే చనిపోయాడన్నారు. అట్టి కేసులో హుస్సైన్ ఖాన్ ఏ అన్సార్ ఖాన్, తాహెర్ లు మరికొంత మంది పై కేసు నమోదు కావడం జరిగిందని, అట్టి కేసులో అన్సార్, తాహెర్ లు అరెస్టు అయి ప్రస్తుతము జైల్ లో ఉన్నారని వివరించారు. మంగళవారం బోధన్ లోని శ్రీనివాస్ నగర్ లో దొంగతనం చేసిన రాగి వైర్ ను అమ్మడానికి వెళ్తుం డగా వారిని పోలీస్ సిబ్బంది వెంబడించి పట్టుకుని వారి దగ్గర నుండి 18 కిలోల రాగి వైర్, ఒక మోటార్ సైకల్, రెండు పానాలు, రెండు మొబైల్ ఫోన్ లు స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలోని బోధన్ పట్టణంతో పాటు, రూరల్, రుద్రూర్, వర్ని, కోటగిరి, యెడపల్లి, రెంజల్, నవీపేట్, నందిపేట్, నిజామాబాద్ రూరల్ పరిధిలో మొత్తం 28 కేసులని చేదించిన సీసీఎస్ సిబ్బంది సీసీఎస్ సీఐ సురేశ్, రవీందర్, హెచ్సి గిరి, పీసీ రాజేంద్ర ప్రసాద్, బోధన్ టౌన్ సీఐ వి.వెంకట నారాయణ, సిబ్బంది పిసి శ్రీకాంత్ లను సీపీ అబినందించారు.

## మాక్లూర్ కళాశాల ను తనిఖీ చేసిన జిల్లా ఇంటర్ విద్య అధికారి

**కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 17 :**

విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ ఆదేశించారు.మంగళవారం నిజామాబాద్ జిల్లా మాక్లూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కళాశాలలో తరగతి గదులను సందర్శించారు.అధ్యాపకుల బోధన విధానంపై విద్యార్థులతో మాట్లాడారు.అనంతరం ప్రిన్సిపల్, అధ్యాపకులతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని,ప్రతి రోజు విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ, దృష్టిని కొనసాగించాలని అన్నారు.మారుమూల ప్రాంతాల నుంచి వస్తున్న పేద,బడుగు,బలహీన విద్యార్థుల భవిష్యత్ కు బాటలు వేసే విధంగా విద్యను అందించాలని అన్నారు.కళాశాల



పరిసరాలను తనిఖీ చేసి ఆవరణ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలను పెంచడం పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. డ్రగ్స్ పై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.2024 - 25 విద్యా సంవత్సరంకు రానున్న వార్షిక పరీక్షలకు అధ్యాపకులు ప్రణాళిక బద్ధంగా బోధన చేసి మంచి ఉత్తీర్ణత ఫలితాలను సాధించాలని ఆదేశించారు.రాబోయే ఇంటర్ ప్రయోగ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంతో పాటు వెనుకబడిన బడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు తో పాటు,వారు కూడా ఉత్తీర్ణులు అయ్యేందుకు ప్రణాళికతో పని చేయాలని ఆదేశించారు.సమావేశంలో ప్రిన్సిపాల్ గంగారంతో పాటు అధ్యాపకులు,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## తెయులో ఎల్ఎల్ బి,ఎల్ఎల్ఎంలో తక్షణ ప్రవేశాల భర్తీ



**కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,డిసెంబర్ 17 :**

తెలంగాణ విశ్వవిద్యాలయంలో న్యాయ కళాశాలలో గల ఎల్.ఎల్.బి కోర్సులో ఖాళీగా ఉన్న 14 సీట్లకు 12 ఎల్.ఎల్.ఎంలో ఖాళీగా ఉన్న ఒక సీటును 2024 స్టేట్ ఎంట్రన్స్ ర్యాంకు మెరిట్ ఆధారంగా రిజర్వేషన్ విధానాన్ని పాటిస్తూ,విశ్వవిద్యాలయ నిబంధనలను అనుసరించి తక్షణ ప్రవేశాలను భర్తీ చేసినామని తెలంగాణ విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ కే.సంపత్ కుమార్ పేర్కొన్నారు.తక్షణ ప్రవేశాల్లో 29 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ ప్రవేశాల ప్రక్రియ న్యాయ కళాశాలలో సెమినార్ హాలులో నిర్వహించి ఎంపికైన విద్యార్థుల వివరాలు ప్రకటించామని అడ్మిషన్స్ డైరెక్టర్ పేర్కొన్నారు.తక్షణ ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు ఫీ రియంబర్స్మెంట్ మరియు హాస్టల్ వసతి ఇవ్వబడదన్నారు.

## లగచర్ల రైతుల అక్రమ అరెస్టులు రాజ్యాంగ విరుద్ధం

**– నగర మేయర్ నీతూ కిరణ్...**

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, డిసెంబర్ 17 :**

లగచర్ల రైతుల అక్రమ అరెస్టులు మరియు థర్డ్ డిగ్రీ ప్రయోగించటంపై నిరసనగా రైతుల హక్కులను కాపాడాలని బి.ఆర్.యస్ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎమ్మెల్యే కె.టి.ఆర్ పిలుపు మేరకు నగరంలోని పులంగ్ చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహానికి నగర మేయర్ దండు నీతు కిరణ్ వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ప్రజా



పాలనా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రాచరిక పాలనా సాగిస్తుందని అమాయక గిరిజన,దళిత రైతుల భూములను అక్రమంగా లాకున్ని అల్లుడికి అప్పగించాటానికి రైతులను ఆక్రమంగా అరెస్టు చేసి లొంగని వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి వేధింపులకు గురి చేయటకు నిరసన తెలిపే వారిపై అక్రమ కేసులు పెడుతూ,వేధింపులకు గురిచేస్తున్నారని ఇటువంటి ఆటవిక అరాచక పాలనను తెలంగాణ సమాజం సహించదని అన్నారు.బాధితులకు బి.ఆర్.యస్ పార్టీ అండగా ఉండుందని ప్రజా వ్యతిరేక పాలనకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెప్తారనిహెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి చైర్మన్ దదన్నగారి విట్టల్ రావ్,బారసా నగర అధ్యక్షులు సిర్ప రాజు,మాజీ నూడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి,సీనియర్ నాయకులు సుజిత్ ఠాకూర్,సత్యప్రకాష్,కరిపే రాజు,గాండ్ల లింగం,శంకర్,అరవింద్ సింగ్,రాజు,భాస్కర్,సురేష్,ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ లీగ్ పోటీలకు లక్షిత్

**కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,డిసెంబర్ 17 :**



రాష్ట్రస్థాయి క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్ 14 క్రికెట్ లీగ్ పోటీలకు జిల్లాకు చెందిన కట్కం లక్షిత్ ఎంపికయ్యాడు.రాష్ట్రస్థాయి క్రికెట్ లీగ్ పోటీలు హైదరాబాద్ లో నిర్వహిస్తున్నారు.లక్షిత్ కటకం సాగర్ కుమారుడు తన తాత సాయిబాబా ప్రోత్సాహంతో క్రికెట్ ఆటలో అడుగు పెట్టాడు.హైదరాబాద్లో జరిగిన లి మొదటి మ్యాచ్లో బ్యాటింగ్ లో 20 పరుగులు బౌలింగ్లో ఒక వికెట్ తీసి రాణించాడు.ఈ ఎంపీక పట్ల మాజీ బీఆర్ ఎలెవన్ జట్టు కెప్టెన్ సోమ శ్రీనివాస్,శ్యామ్,అజ్మత్,ప్రవీణ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# సీఎం కప్ సాఫ్ట్ బాల్ మరియు బేస్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

**కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,డిసెంబర్ 17 :**

జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ ఆర్మూర్ క్రీడ మైదానంలో మంగళవారం జరిగిన సీఎం కప్ సాఫ్ట్ బాల్ బేస్ బాల్ జిల్లా జట్లను డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ లు తెలిపారు.ఎంపిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుప్పాల లక్ష్మీనరసయ్య విచ్చేసి క్రీడలను ప్రారంభించి క్రీడాకారులని ఉద్దేశించి



మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ రాష్ట్రంలో పండగ వాతావరణంగా జరుపుకుంటున్న అందుకు సంతోషిస్తూ ఈనెల 18 నుండి 21 వరకు గచ్చిబౌలి స్టేడియంలో జరిగే బేస్ బాల్ మరియు ఈనెల 28 నుండి 31 వరకు మెదక్ జిల్లా స్టేడియంలో జరిగే సాఫ్ట్ బాల్ పోటీలలో జిల్లా మహిళల మరియు పురుషుల జట్లను ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మర్కంటి సుజాత,చిప్ప నవీన్, జిల్లా సాఫ్ట్ బాల్ మరియు బేస్ బాల్ కోచ్ లు ఈ నరేష్,వి మౌనిక,కే సంజీవ్, హెచ్ అనికేత్, ఎం.రమేష్ లు పాల్గొన్నారు.

## శిక్షణ శిబిరానికి జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

**కబురు న్యూస్లినిజామాబాద్ స్పోర్ట్స్,డిసెంబర్ 17 :**

జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ముప్కల్ ఇండోర్ స్టేడియంలో అండర్ 20 జిల్లా జట్టును శిక్షణ శిబిరానికి ఎంపిక చేశారు. ఏం పీకాక్ జిల్లా నలుమూలల నుండి 150 సభ్యులు క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ ఎంపికలో ప్రతిభ నైపుణ్యాలు




కనబరిచిన 20 క్రీడాకారులను శిక్షణ శిబిరానికి ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏ.లింగయ్య గంగారెడ్డిలు తెలిపారు.ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎలేటి సంతోష్ రెడ్డి ఎల్ఐటి గంగారెడ్డి బుస్సాపూర్ వాస్తవ్యులు పాల్గొన్నారనీ తెలిపారు.ఈ శిక్షణ శిబిరం 18 న ఇండోర్ స్టేడియంలో సాయంత్రం ప్రారంభం కానుందనీ తెలియజేశారు.ఈ శిబిరం 25 డిసెంబర్ వరకు కోచింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.శిక్షణ శిబిరంలో నైపుణ్యం కనపరిచిన 12 మంది క్రీడాకారులను ఎంపిక చేసి జనగాంలో జరగబోయే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పంపనున్నట్లు తెలిపారు.ఈ ఎంపికలో వ్యాయామ ఉపాధ్యాయులు రాజ్ కుమార్, రాజేందర్,జ్యోతి సురేష్ ,సాయిలు,అన్వేష్ గంగాధర్,గణేష్, హరీష్ శ్రీను.అరవింద్ పర్యవేక్షణలో నిర్వహించడం జరిగిందని వారు తెలియజేశారు.

## ప్రముఖ దత్తక్షేత్రం గానుగాపూర్ కు బయలుదేరిన దత్త స్వాములు

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,డిసెంబర్ 17 :**

కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లాలోని ప్రముఖ దత్త క్షేత్రం గానుగాపూర్ కు మంగళవారం దత్త స్వామి భక్తులు మాలధారణ స్వాములు ఐదు వాహనాలలో 50 మంది భక్తజన బృందంతో బయల్దేరి వెళ్లారు.సద్గురు ధర్మము,ధార్మిక సంస్థ



వ్యవస్థాపక చైర్మన్,దత్తోపాసకులు ఇప్పకాయల హరిదాసు స్వామీజీ ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు.రెండు రోజులపాటు జరగనున్న ఈ యాత్రలో తెలంగాణ,కర్ణాటక పరిధిలో ఉన్న ప్రముఖ దైవ క్షేత్రాలు జర సంఘ్,కర్ణాటక రే చింతల్ గణపతి ఆలయం,బీదర్ నరసింహస్వామి ఆలయం,హుమ్నాబాద్ లోనిమాణిక్ ప్రభు మఠంతో పాటు గంగాపూర్ దత్తక్షేత్రంలో దర్శనం చేసుకుని కుంసిలో ఉన్న దైవ క్షేత్రాన్ని కూడా దర్శనం చేసుకుని తిరిగి రానున్నట్లు హరిదాస్ స్వామీజీ తెలిపారు.

కబురు KABURU TELUGU DAILY
బుధవారం డిసెంబర్ 18 2024

# ఐటీని అభివృద్ధి చేసి చూపిస్తాం

- గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నాం
- రాష్ట్రంలో ఐటీ కంపెనీ ఎక్కడికి పోలేదు
- నూతన పెట్టుబడులతో రాష్ట్ర అభివృద్ధి సుసాధ్యం

**కబురు న్యూస్, రామగిరి డిసెంబర్ 17**



చిన్న ఇండస్ట్రీలో ప్రోత్సాహం కొరకు ఎంఎస్ఎంఈ ఏర్పాటు మంథని: తెలంగాణలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మంగళవారం అసెంబ్లీలో ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగిస్తూ .... రాష్ట్రంలో నూతన పెట్టుబడులతో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన తెలిపారు. ఫోక్ సాంగ్ కంపెనీ ఎక్కడికి పోలేదని ఆయన గుర్తు చేశారు. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు పకడ్బందీగా ప్రణాళిక రచించినట్లు ఆయన పేర్కొన్నారు. గతం ప్రభుత్వం చేసిన తప్పిదాలను సవరించుకొని నూతన పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులన్నిటికీ వడ్డీని కడుతున్నామని, తాజా మాజీ సర్పంచుల బిల్లులు విడుదల అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని ఐటి రంగంగా అభివృద్ధి చేసేందుకు నూతన ప్రభుత్వం పనిచేస్తున్న విషయాన్ని విపక్షాలు గుర్తించాలని ఆయన తెలియజేశారు. రాష్ట్రంలో నూతన పెట్టుబడులను ప్రోత్సహించేలా చిన్న ఇండస్ట్రీలను ఏర్పాటు సులభతరం చేసేలా ఎమ్ ఎస్ఎంఈ పాలసీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఐటి అభివృద్ధి అంశా పైన ప్రభుత్వం ప్రణాళిక రచిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్, ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ ఇటువంటి టెక్నాలజీల పైన కొత్త ఆలోచనలతో ముందుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించేలా ఐటీ రంగాన్ని విస్తరించి, యువతకు నైపుణ్యాలు నేర్పిస్తామని ఆయన పేర్కొన్నారు. నూతన ఐటీ పార్కులను ఏర్పాటు చేసి డేటా సెంటర్లను అభివృద్ధి చేస్తామని ఆయన వివరించారు. అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కోరపల్లి అంబేద్కర్ చౌరస్తాలో బస్టాండ్ ఏర్పాటు చేయాలి....

**కబురు న్యూస్, జమ్మికుంట డిసెంబర్ 17...**



జమ్మికుంట మండలం వెంకటేశ్వర్ల పల్లి కోరపల్లి గ్రామాల మధ్య కూడలి అంబేద్కర్ వద్ద రెండు రెండు వరుసల రోడ్లు ఒకటి బిజిగిరి షరీఫ్ ఒకటి పోతిరెడ్డిపల్లి ఒకటి విలాసాగర్ ఒకటి కోరేపల్లి నుండి జమ్మికుంట వెళ్లే రెండు వరుసల తారు రోడ్లు కలవు గత ప్రభుత్వంలో రోడ్లు వేశారు కానీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఒక బస్టాండ్ ఏర్పాటు చేయలేదు. కావున ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు ఎక్కడ నిల్చవాలో తెలియడం లేక రోడ్లపైన ఇటు విలాసాగర్ నుండి ఇసుక ట్రాక్టర్లు ఇటు బిజీ షరీఫ్ నుండి అనేకమైన వాహనాలు పోతిరెడ్డిపల్లి రోడ్డు నుండి ఇసుక ట్రాక్టర్లు రావడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు ఇలాంటి సందర్భాలలో కొన్ని ఆక్సిడెంట్లు కూడా జరిగినాయి కొందరి ప్రాణాలు కూడా కోల్పోయారు కావున కోరపల్లి వెంకటేశ్వర పల్లి సంబంధించిన ఈ సెంటర్లో ముందు భవిష్యత్తులో అతిపెద్ద సెంటర్గా వెలువడే అవకాశం ఉంది కావున ఇక్కడ ఒకటి బస్టాండ్ సౌకర్యం కల్పించాలని అధికారులను అనేకసార్లు వేడుకున్న కూడా ఇప్పటివరకు దీనిపై ఎలాంటి స్పందన రావడం లేదు ఇప్పటికైనా ఈ పరిస్థితులను వచ్చి చూసి ఇక్కడ బస్టాండ్ ఏర్పాటు చేయాల్సిందిగా గ్రామ ప్రజలందరూ కోరుకుంటున్నారు

## ఎస్సారెస్పీ, డిబిఎం పదహారవ కాలువను వెంటనే మరమ్మతు చేయాలి.

– ఎస్సారెస్పీ, డిబిఎం పదహారవ కాలువ మాజీ వైస్ చైర్మన్ సొల్లు బాబు.

**కబురు న్యూస్, హుజురాబాద్ :డిసెంబర్ 17,**



హుజురాబాద్ ఎస్సారెస్పీ, డిబిఎం పదహారవ కాలువ హుజురాబాద్ మార్కెట్ కమిటీ ఆఫీసు నుండి మెయిన్ కెనాలి నుండి మైనర్ కెనాలి డిబిఎం పదహారవ కాలువ హుజురాబాద్ నుండి రంగాపురం శాలపల్లె ఇందిరానగర్ ఇల్లంతకుంట మీదుగా సిరిసేడు నుండి రాఘవ రెడ్డిపేట వరకు డిబిఎం పదహారవ కాలువ చాలా అధ్వాన్నంగా తయారయింది మెయిన్ కెనాలి నుండి నీరు పోవడానికి నాసు చెత్త చెదారం గడ్డి మొలసి విపరీతమైన ముండ్ల చెట్లు ఇతరఅత్ర చెట్లు మొలిచి నీళ్లు వదిలినప్పుడు ఆఖరి వరకు చేరడానికి చాలా ఇబ్బందిగా ఉన్నది అందులో భాగంగా రైతులకు ఇబ్బంది కలుగుచున్నది కాబట్టి డిబిఎం పదహారవ కాలువకు సంబంధించి మొదటి డిపి,రెండవ డిపి,చిన్న చిన్న మైనర్ కాలువలలో గడ్డి మొలసి చాలా అధ్వాన్నంగా తయారు అయినది కావున అధికారులు చొరవ చూపి కాలువలు బాగు చేయవలెను ఇప్పుడు యాసంగి నీళ్లు వదిలినప్పుడు రైతులకు బాగా సమస్యలు మొదలవుతవి కావున అధికారులు స్పందించి కాలువలు వెంటనే మరమ్మత్తు చేయగలరని ఈ కాలువ కింది ఆయకట్టు రైతులు అధికారులను కోరుతున్నారు మీ

# కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నదాతకు బేడీలు...

– ప్రజా సమస్యలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం...
– అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించిన బిఆర్ఎస్ నాయకులు...

**కబురు న్యూస్, : శంకర పట్నం డిసెంబర్ 17**






తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు బేడీలు, ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని బిఆర్ఎస్ పార్టీ శంకరపట్నం మండల శాఖ అధ్యక్షుడు గంట మహిపాల్ ఆరోపించారు. మంగళవారం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పిలుపుమేరకు కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకర పట్నం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని పార్టీ ఆధ్వర్యంలో అందజేసిన విన్నత నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము దేశానికి అన్నం పెట్టే రైతన్నలను, భూమిని నమ్ముకునే, పంటలు సాగు చేసుకుని, తమ కుటుంబాలను పోషించుకుని బ్రతికే రైతులు, తమ భూమిని తమకే ఉంచాలని, తమ బ్రతుకులను నాశనం చేయవద్దని తమ భూములు కంపెనీల నిర్మాణానికి ఇవ్వమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నియోజకవర్గం లోని లగచర్ల గ్రామంలో ఉద్యమం చేసిన రైతులపై అక్రమంగా పోలీస్ కేసులను పెట్టించి రైతులకు బేడీలు వేసి, రైతులను మనోవేదనకు గురి చేస్తున్నారని, లగచర్ల ఘటనలో జైలు జీవితం గడుపుతున్న హిర్య నాయక్ అనే రైతుకు గుండెపోటు వచ్చిన బేడీలు వేసుకుని ఆసుపత్రికి తీసుకువెళ్లిన పోలీసులు, దేశానికి అన్నం పెట్టే రైతులని రోగాల బారిన పడిన కనికరం చూపని రాష్ట్ర ప్రభుత్వము ,పోలీసులు, రాష్ట్రంలో ప్రజా సమస్యల ను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోవడంలేదని, ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఇచ్చిన పిలుపుమేరకు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేసినట్లు మహిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మొత్కూరి సమ్మయ్య, మాజీ ఎంపిటిసి గాండ్ల తిరుపతి, ఉద్యమ కారుడు చెరుకు వెంకటేశం, నాయకులు శ్రీకాంత్ గౌడ్, గొడిశాల తిరుపతి గౌడ్, సంపత్, మొగిలి, సత్యనారాయణ, పోచయ్య, కిట్టు, రాజ్ కుమార్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా నర్సాపూర్ చిల్డ్రన్ పార్కులో గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత.



**కబురు న్యూస్, మెదక్ నర్సాపూర్.**

లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ,అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా..రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో శేఖర్ బిక్షపతి నర్సింగరావు శివకుమార్ బాబ్యానాయక్ బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పెన్షనర్స్ డే.

– అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్

**కబురు న్యూస్, హుజురాబాద్/ : డిసెంబర్ 17,**




హుజురాబాద్ మంగళవారం రోజున పెన్షనర్స్ డే సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హుజురాబాద్ అండ్ జమ్మికుంట శాఖల ఆధ్వర్యంలో హుజురాబాద్ పట్టణంలోని స్థానిక సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్లో టాప్రా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ అధ్యక్షతన పెన్షనర్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించ నైనది ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ గౌరవాధ్యక్షులు కట్ట నాగభూషణ చారి మాట్లాడుతూ ఈరోజు పెన్షనర్స్ తమ పెన్షన్ రాజ్యాంగబద్ధంగా పొందడానికి మూలకారకుడైనటువ టి డి ఎస్ నకార పెన్షనర్లకు ఆరాధ్య దైవం అని వారి సేవలు అజరామరం మరియు చిరస్మరణీయమని తెలుపుతూ పెన్షనర్స్ పితామహుడు డిఎస్ నకార సేవలను కొనియాడినారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు%చీూ% మరియు %జూూ% విధానాన్ని రద్దు పరచి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వారు డిమాండ్ చేసినారు అదేవిధంగా ఈపీఎఫ్ 95 మరియు సీఎం పిఎఫ్ 98 సింగరేణి ఉద్యోగులకు కనీస పెన్షన్ 15 వేల రూపాయలు పొందునట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసినారు కార్యక్రమంలో జిల్లా శాఖ ట్రెజరరి ఇటువంటి తిరుమలయ్య జమ్మికుంట శాఖ అధ్యక్షులు గరిగ చంద్రయ్య హుజరాబాద్ శాఖ అధ్యక్షులు చొల్లేటి మల్లారెడ్డిప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య జిల్లా ఉపాధ్యక్షులు బొంగోని వెంకటయ్య సయ్యద్ మునురుద్దీన్ ఈ రామస్వామి హుజురాబాద్ శాఖ ట్రెజరీ మండల వీరస్వామి జమ్మికుంట శాఖ గౌరవ అధ్యక్షులు శీలం మల్లేశం సీనియర్ నాయకులు మారేపల్లి మొగిలయ్య మేక మల్ల సుధాకర్ పరాంకుశం సనత్ కుమార్ తాటిపాముల కనుకయ్య దొంత హరికిషన్ గంగిశెట్టి సాంబయ్య తాళ్ల పెల్లి రామకృష్ణ తౌటం శ్రీహరి ఎం రవీందర్ ఎస్ సారభద్రస్వామి గాజర్ల బుచ్చిరాజం జక్కె లక్ష్మయ్య ఓరెమ్ వీరయ్య జాన పట్ల కాంతయ్య మంతెన సుదర్శన్ కే రవీందర్ రెడ్డి వేల్పుల భాస్కర్ నల్ల రాజిరెడ్డి గూడూరి స్వామి ఎస్ వెంకన్న ఎల్ రవీందర్ రెడ్డి వి వీరయ్య ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన



**కబురు న్యూస్, రామగిరి డిసెంబర్17.**

రామగిరి మండలంలోని ఆదివారంపేట, నాగేపల్లి మరియూ రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ను పరిశీలించడం జరిగింది. మండలంలోని పోలింగ్ స్టేషన్ ల ఫైనల్ పబ్లికేషన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఉమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మరియూ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు సరికావు.

**కబురు న్యూస్, దినపత్రిక మెదక్ నర్సాపూర్.**

– బిన్యాయమైన సమస్యలు పరిష్కరించాకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తాం.
– బి కడారి నాగరాజు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు.






గ్రామ పంచాయితీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఛలో ఇందిరాపార్క్ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా నిర్వహించారు. ధర్నాకు మండలంలోని కార్మికులు వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్లో బందించడం సరైనదికాదని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరా కాలం పూర్తనా కార్మికులకు ఇచ్చిన హామీలు అమలుచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో నెలకొన్న పరిశుద్దని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తు గ్రామాలలో ఏలాంటి సీజనల్ వ్యాధులు సోకకుండా సేవలందిస్తున్న కార్మికుల గోస వినిపించాలని ప్రభుత్వానికి తెలపడం కోసం వెళ్తున్న పంచాయతీ కార్మికులను ఉదయనే అరెస్టు చేస్తూ భయభ్రాంతులకు గురించేసారని మండిపడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో సుమారు 08,09 నెలలు వేతనాలు లేకున్నా గ్రామాలలో పస్తులు ఉండి కూడా పనిచేసారని గుర్తుచేశారు. ఉదయం చలి, ఎండ, వర్షం లెకచేయకుండా గ్రామాలలో ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న కార్మికుల కష్టాలు తీర్చమంటే అరెస్టులు చేయడం సరైనదికదాని, వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మికులకు కనీస సౌకర్యాలు, ఉద్యోగ భద్రత, 26 వేల వేతనం, ESI, PF, ప్రమాద బీమా, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిషత్తు ఉద్యమాలు ఉద్రుతంగా నిర్వహిస్తామని హెచ్చరించారు.

## కేశవపట్నం గ్రామంలో రోడ్డు వెడల్పు చేయాలి...

– వినతిపత్రం అందజేసిన సాంఘిక సామాజిక సేవాకర్త రాజ్ కుమార్.....

**కబురు న్యూస్, శంకరపట్నం డిసెంబర్ 17**




కేశవపట్నం గ్రామంలో రోడ్డు వెడల్పు చేసి ప్రయాణికుల ఇబ్బందులను తీర్చాలని సామాజిక సేవాకర్త చల్ల రాజ్ కుమార్ ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండల కేంద్రంలోని కేశవపట్నం గ్రామంలో అనంతుల కొండాల్ ఇంటి నుండి కేశవపట్నం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు రోడ్డు ఇరుకుగా ఉందని, కేశవపట్నం గ్రామం మీదుగా సైదాపూర్, తిమ్మాపూర్, చిగురు మామిడి హుస్నాబాద్, మీదుగా హైదరాబాద్ వరకు వివిధ వాహనాల ద్వారా రైతులు, ప్రజలు, ప్రజా అవసరాల కోసం వేలాపాలా లేకుండా ప్రయాణం కొనసాగిస్తారని, కేశవపట్నం గ్రామంలో ఇరుకుగా రోడ్డు ఉండడంతో అనేక ప్రమాదాలు జరిగి ప్రయాణికులు గాయాల బారిన పడిన ఘటనలు, నష్టపోయిన ఘటనలు, ఉన్నాయని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించి 33 ఫీట్ల రోడ్డు వెడల్పు చేపట్టి, ప్రమాదాలు సంభవించకుండా ప్రత్యేక చర్యలు తీసుకొని, ప్రయాణికులకు, గ్రామ ప్రజల ఇబ్బందులు తీర్చాలని జిల్లా ఉన్నతాధికారికి వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించి శాఖ పరంగా తగిన చర్యలు తీసుకోనున్నట్లు హామీ ఇచ్చినట్లు రాజకుమార్ తెలిపారు.

## పెద్ద కొండచిలువ పట్టివేత.

**కబురు న్యూస్, రామగిరి డిసెంబర్ 17**



. కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం అతిపెద్ద కొండచిలువను పట్టుకున్నారు. కమాన్పూర్ క్రాస్ రోడ్ వద్ద కామెర నరసయ్య ఇంటి వద్ద కొండచిలువ ఉండగా కల్వచర్లకు చెందిన పాములను పట్టే ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సభ్యుడు కారంగుల శ్రీనివాస్ కు సమాచారం ఇచ్చారు. దీంతో శ్రీనివాస్ కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వద్ద చెట్లలో ఉన్న కొండచిలువను పట్టుకొని సంచిలో వేశాడు. అనంతరం అదేంటి రామగిరి ఖి లా ప్రాంతంలో వదిలివేయడం జరుగుతుందని శ్రీనివాస్ తెలిపారు. సుమారు 15 ఫీట్ల పొడవు 15 కిలోల బరువు గల ఈ కొండచిలువను చూసేందుకు ప్రజలు భారీ ఎత్తున భూమికూడారు. ఈ ప్రాంతంలో ఇంత పెద్ద కొండచిలువ కనిపించడం ఇది ప్రధమమని ఈ ప్రాంత వాసులు తెలుపుతున్నారు.

## గ్రామపంచాయతీ సిబ్బంది అరెస్టు




**కబురు న్యూస్, రామగిరి డిసెంబర్ 17.**

కమాన్ పూర్ గ్రామపంచాయతీ కారోబార్లను ముందస్తు జాగ్రత్తగా అదుపులోకి తీసుకోవడం జరిగింది.చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న గ్రామపంచాయతీ సిబ్బందిని పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. గత మూడు నెలలుగా పెండింగ్ లో ఉన్న జీతాలను ఇవ్వాలని చలో అసెంబ్లీకి వెళ్తున్న కమాన్ పూర్ మండలంలోని పలు గ్రామాల గ్రామ పంచాయతి సిబ్బందిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో మండల అధ్యక్షుడు భూమయ్య, ప్రధాన కార్యదర్శి భీమరాజు, రమేష్, శంకర్, సంతోష్, సాకేత్, విజయేందర్ తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ..

– కాంగ్రెస్ మండల శాఖ వీణవంక

**కబురు న్యూస్, , హుజురాబాద్ / వీణవంక, డిసెంబర్ 17.**



వీణవంక మండలం ఘన్ముక్ల గ్రామానికి చెందిన ఉమ్మెత్తుల లత ఇటీవలే అనారోగ్యానికి గురి అయి చికిత్స నిమిత్తం తెలంగాణ ప్రభుత్వానికి హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఓడితల ప్రణవ్ బాబు వద్ద దరఖాస్తు చేసుకోగా, వారికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద ఉమ్మెత్తుల లత కు వైద్య ఖర్చుల నిమిత్తం18,000 రూపాయల చెక్కు రాగ, వారి తండ్రి సమ్మిరెడ్డి కి మంగళవారం హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు కట్కూరి ఉపేందర్ రెడ్డి, కంకణాల జగదీశ్వర్,మాజీ సర్పంచ్ కర్ర తిరుపతి రెడ్డి,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లో ఫిట్ ఇండియా సైక్లింగ్ డ్రైవ్ ను ప్రారంభించిన పారా ఒలింపిక్ పతక విజేత కుమారి జీవన్ జీ దీప్తి

**కబురు న్యూస్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, డిసెంబర్ 17**

ఒలింపిక్ కాంస్య పతక విజేత కుమారి జీవన్ జీ దీప్తి జెండా ఊపి ప్రారంభించారు.

ఫిట్ ఇండియా సైక్లింగ్ డ్రైవ్ ను ప్రారంభించడం ద్వారా, ఆరోగ్యకరమైన, హరిత భారత్ దిశగా– ఫిట్ ఇండియా ఉద్యమం అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా 1,000 ప్రదేశాల్లో ఈ రోజు ఉదయం ఏకకాలంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలోని హాకీ కాంప్లెక్స్ లో నిర్వహించిన 'ఫిట్ ఇండియా సైక్లింగ్ ట్యూస్ డేస్'ను పారా ఒలింపిక్ కాంస్య పతక విజేత కుమారి జీవన్ జీ దీప్తి జెండా ఊపి ప్రారంభించారు.




సుస్థిరమైన, ఆరోగ్యకరమైన రవాణా దిశగా సైక్లింగును ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన ఈ 3 కిలోమీటర్ల రైడ్ లో దాదాపు 90 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అథ్లెట్లు, యువకులు, పౌరులు సహా దాదాపు 125 మంది పాల్గొన్నారు. 'ఫిట్ నెస్ కీ డోస్, ఆదా గంటా రోజ్' అన్న గౌరవనీయ ప్రధానమంత్రి సందేశాన్ని ఈ కార్యక్రమం ప్రతిధ్వనించింది.ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలుష్యం వంటి పర్యావరణ సమస్యల పరిష్కారంతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, సైక్లింగ్ ను రోజువారీ శారీరక దారుఢ్య ప్రక్రియగా అవలంబించేలా ప్రజలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ లక్ష్యం.

## డిసెంబర్ 17 42వ అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం

**కబురు న్యూస్, డిసెంబర్ 17.**

డి ఎస్ నకారా అని పిలవబడే ధరం స్వరూప్ నకారా .... 8వ ఏప్రిల్ 1914 లో ముంబైలో జన్మించారు. అలహాబాద్ యూనివర్సిటీ నుండి ఇంగ్లీష్ లిటరేచర్ డిగ్రీ లో గోల్డ్ మెడల్ సాధించారు. వీరు ఇంగ్లీష్ భాషతో పాటు ఉర్దూ సాహిత్యం పై మంచి పట్టు కలిగిన వారు.

1937 లో కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ అకౌంటింగ్ శాఖలో ఉద్యోగం లో ప్రవేశించారు. తదనంతరం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ లాంటి ప్రముఖ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తూ... ప్రాగా టూల్స్ చైర్మన్ గా సేవలందించారు. అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థల ఆర్థిక సలహాదారుగా నిజాయితీ తో కూడిన విశిష్ట సేవలు అందించారు. 1972లో ఆర్థిక శాఖలో భాగంగా కేంద్ర రక్షణ శాఖలో ఆర్థిక సలహాదారువా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు పెన్షనర్ల సమస్యలపై పోరాటం చేసి పెన్షనర్ల హక్కుల కాపాడిన వాడిగా ఆయనకు వచ్చిన పేరు చిరస్మరణీయం. యావత్ దేశంలోని పెన్షనర్లందరూ ఆయనను ఆరాధ్య దైవంగా భావిస్తున్నారు.పెన్షనర్ల కు పెన్షన్ల చెల్లింపులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వివక్షను అందరికీ తెలియజేస్తూ వాటిపై అనేక పోరాటాలు సాగించారు. 1977 కంటే ముందు పెన్షన్లలో రకరకాల కోతలను విధించే పరిస్థితి ఉండేది. ఆ రోజుల్లో 675 పెన్షన్ మాత్రమే హైయెస్ట్ పెన్షన్ గా ఉన్నదంటే పరిస్థితిని మనం అర్థం చేసుకోవచ్చు. 1979లో కేంద్ర ప్రభుత్వం చేసిన ఒక



చట్టం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేసింది.కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం 1979 తర్వాత రిటైర్ అయిన ఉద్యోగులకు దీని కంటే ముందు రిటైర్ అయిన ఉద్యోగులకు తీవ్ర ఆర్థిక వ్యత్యాసాలు ఉండడంతో దాన్లో ఆయన కూడా బాధితుడు కావడం జరిగింది. ఈ వివక్షను వ్యతిరేకిస్తూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 32 క్రింద సుప్రీంకోర్టులో ఒక దావా వేశారు అట్టి దావాపై 1982 డిసెంబర్ 17న సుప్రీంకోర్టు ఒక చారిత్రాత్మకమైన తీర్పును పెన్షనర్లకు అనుకూలంగా ఇచ్చింది.

**తీర్పులోని ముఖ్యాంశాలు :-**

**- పెన్షన్ అనేది యజమాని దయాబిక్ష కాదు, అది ఉద్యోగి హక్కు.**
**- పెన్షన్ అనేది అతడు గతంలో చేసిన సేవలకు గుర్తింపు మాత్రమే.**
**- ఉద్యోగి పదవి విరమణ అనంతరం అతని వృద్ధాప్య జీవితం గౌరవప్రదంగా ఉండాలి. మరియు అతడు తన స్వశక్తిపై జీవించాలి.ఒక నిర్దిష్టమైన తేదీకి ముందు,... తరువాత... పెన్షన్ల చెల్లింపులలో వ్యత్యాసం ఉండరాదు. ఒక క్యాడర్లో రిటైర్ అయిన వారిని ఒకే తరగతి గా భావించాలి.**

ఈ తీర్పు వల్ల యావత్ దేశంలోని లక్షలాదిమంది పెన్షనర్లకు ఎంతో మేలు చేకూరింది. ఆ తీర్పు వచ్చిన తేదీ,17 డిసెంబర్ ను అఖిలభారత పెన్షనర్ల దినోత్సవం గా జరుపుకుంటున్నాము. ఇంతటి తీర్పుకు కారకుడైన నకారా ని స్మరించుకుంటున్నాం. 94 సంవత్సరాల నిండు జీవితాన్ని గడిపి, తేదీ 29 జూలై 2009 రోజున పెన్షనర్ల ఆశాజ్యోతి.... డిఎస్ నకారా మరణించారు.వారి ఆశయాలను సజీవంగా ఉంచుతూ పెన్షనర్ల సంక్షేమం కొరకు కృషి చేయడమే మన ముందు ఉన్న కర్తవ్యం

. సి.రామ రాజు విశ్రాంత మండల విద్యాధికారి (రెగ్యులర్)

## హుజురాబాద్ సిటీ సెంట్రల్ లో గ్రాండ్ క్రిస్టమస్ సెలబ్రేషన్స్..

– ఫాస్టర్స్ కమిటీ అధ్యక్షుడు.. పాస్టర్ డేవిడ్ రాజు..

**కబురు న్యూస్, ,హుజురాబాద్/వీణవంక, డిసెంబర్ 17.**

హుజురాబాద్ సిటీ సెంట్రల్ లో పాస్టర్స్ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు పాస్టర్ డేవిడ్ రాజు కార్యదర్శి పాస్టర్ సారంగపాణి ట్రెజరర్ పాస్టర్ జోసఫ్ తో హుజురాబాద్ పాస్టర్ తో పాటు మండలంలో ఉన్న పాస్టర్స్ అందరు కలిసి గ్రాండ్ క్రిస్టమస్ సెలబ్రేషన్స్ రాత్రి వేళ ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు జాతీయ, అంతర్జాతీయ వాడబడుతున్న దైవజనులు రెవరెండ్ డాక్టర్ జడ్సన్ అబ్రహం హాజరై ప్రత్యేక సందేశాన్ని అందించారు. ఆయనతోపాటు హుజూరాబాద్ కౌన్సిలర్లు మారేపల్లి సుశీల ములుగు పూర్ణచందర్, పాస్టర్స్ హాజరయ్యారు. క్రైస్తవులతో కలిసి పాస్టర్స్ రాత్రి 12 గంటల వరకు ఈ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమాలను చూడడానికి క్రైస్తవులతో పాటు కులమత బేధం లేకుండా అధిక



సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. మండల పాస్టర్స్ కమిటీ వారు ప్రతి సంవత్సరం వారి సేవలను బట్టి ఒక సీనియర్ పాస్టర్ దంపతులకు బట్టలు పెట్టి సన్మానం చేస్తారన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం రంగాపూర్ కల్వరి టెంపుల్ లో సేవ చేస్తున్న రెవరెండ్ డాక్టర్ పి.ఆర్ నెల్సన్ – సుధీన దంపతులను నియోజకవర్గ మండల పాస్టర్ లందరూ ఘనంగా సన్మానం చేశారు. ప్రత్యేక అతిథులు జడ్సన్ అబ్రహాము, కౌన్సిలర్లు పాస్టర్లు అందరూ కలిసి కేక్ కట్ చేసి అక్కడికి వచ్చిన అందరికీ పంచిపెట్టారు. అక్కడికి హాజరైన దాదాపు 700 మందికి కౌన్సిలర్ పూర్ణచందర్ సహకారంతో ప్రేమ విందును ఏర్పాటు చేశారు. పిల్లలు యూత్ సభ్యులు సంఘ సభ్యులు వృద్ధులు ఆటపాటలతో వృత్యాలతో యేసు పుట్టిన సంబరాలను ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకలకు హుజురాబాద్ నియోజకవర్గం అధ్యక్షులు డేనియల్ సెక్రటరీ టీ, ఎలీషా ట్రెజరర్ వి ప్రసాద్, పాస్టర్లు ఏసుదాసు ప్రేమ్ కుమార్, నెల్సన్, కిరణ్, ఆంధ్రయ్య, సామ్యూల్, సామ్సన్, ఆజర్య, కిరణ్, ఆనంద్, మార్కు, పొలయ్య తదితరులు హాజరయ్యారు.

## ఘనంగా జాతీయ పెన్షనర్స్ దినోత్సవం...

– 25 మంది రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం..

**కబురు న్యూస్, శంకరపట్నం డిడిసెంబర్ 17**

జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో అధ్యక్షుడు మోసం అంజయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలలో విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన 25 మంది రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.పదవి విరమణ పొందిన ఉద్యోగులు తమకు తల్లిదండ్రులతో సమానమని,వారికి సేవ చేయడం భగవంతుడు ఇచ్చిన వరమని ,జిల్లా ట్రెజరీ అధికారి నాగరాజు అన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యలను సబ్ ట్రెజరీ అధికారి మంజుల నివృత్తి చేశారు.రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన



కార్యదర్శి దామెర మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరేందర్ రెడ్డి, కార్యదర్శులు రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, కోశాధికారి బి నరేందర్, సంఘం నాయకులు శ్రీధర్ రావు, శంషోద్దీన్, మల్లయ్య, రామచంద్రంతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



## విద్యార్థిని లక్ష్మీ భవాని కీర్తికి మెరుగైన వైద్యం అందించాలి - మాజీ ఎంపీ నామ డిమాండ్



**కబురు న్యూస్, ఖమ్మం డిసెంబర్ 17:** ఖమ్మం జిల్లా బీసీ గురుకుల పాఠశాలలో చదువుతున్న లక్ష్మీ భవాని కీర్తి అనే విద్యార్థిని ఎలుకల దాడికి గురై గాయాలపాలైన ఘటనపై మంగళవారం ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని నామ డిమాండ్ చేశారు. గురుకుల హాస్టళ్లలో విద్యార్థులకు సరైన మౌలిక వసతులు, మంచి ఆహారం అందకపోవడం వల్ల విద్యార్థులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఎలుకలు కొరికి విద్యార్థులు ఆస్పత్రిపాలవడం అత్యంత బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల హాస్టళ్లలో శుభ్రత, ఆహారం నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరచాలని, విద్యార్థుల కోసం పటిష్టమైన ఆరోగ్య భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు..

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన జెఎస్ఆర్..

**కబురు న్యూస్, హుస్నాబాద్ డిసెంబర్ 17:** హుస్నాబాద్ నియోజకవర్గం చిగురుమామిడి మండలం నవాబ్ పేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిల్లి తిరుపతి గారి తండ్రి పిల్లి దుర్గయ్య గారు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జెఎస్ఆర్ గారు పరామర్శించారు. వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



# ఘనంగా పెన్షనర్ల దినోత్సవం.

**- పెన్షనర్లకు సముచిత స్థానం ఉండాలి.**
**- జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్.**

**కబురు న్యూస్, ఖమ్మం డిసెంబర్ 17:**

జాతీయ పెన్షనర్ల దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో భక్త రామదాసు కళాక్షేత్రంలో జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య అధ్యక్షతన పెన్షనర్స్ డే ను ఘనంగా నిర్వహించారు . ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాజంలో పెన్షనర్లకు సముచిత స్థానం ఉండాలి అని వారు అందించిన సేవలను స్ఫూర్తిని అధికారులుగా మేము గుర్తిరిగి సమర్థవంతంగా పనిచేయుటకు వారి అనుభవం మరువజాలమని అన్నారు . రిటైర్డ్ ఉద్యోగులు వివిధ రంగాలలో వారు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తు ఉంటాయని అన్నారు . పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను జాప్యం లేకుండా పరిష్కారం చేస్తామని అన్నారు . వారి సూచనలను , సలహాలను తీసుకుంటామని వారి ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని మీరు ఇచ్చే సూచనలు సలహాలు తప్పక అమలు చేస్తామని తెలిపారు . ఈ సందర్భంగా జిల్లాలోని సీనియర్ మోస్ట్ పెన్షనర్లను సన్మానించారు . ఈ సన్మానంలో సత్తుపల్లి , పెనుబల్లి , కల్లూరు , వైరా , తల్లాడ , ఏన్కూరు , మధిర , నేలకొండపల్లి , కూసుమంచి , ఖమ్మం నగరంలోని 30 మంది పెన్షనర్లను సన్మానించారు . రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్ బాబు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు విడుదల చేయకుండా ఉద్యోగ విరమణ చేసి పది నెలలు అయినా వారికి రావలసిన గ్రాట్యూటీ



కమ్యూనికేషన్ లీవెన్ క్యాష్మెంట్ జిపిఎఫ్ తదితర ఆర్థిక ప్రయోజనాలు విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ పెనిషనర్లను తీవ్ర ఆవేదనలకు గురి చేస్తున్నదని అన్నారు . నేడు పెన్షనర్స్ డే అందుకు ముఖ్య కారణం రిటైర్డ్ ఉద్యోగి నకార కేంద్ర ప్రభుత్వంలో పెన్షన్ వివక్షనకు గురై సుప్రీంకోర్టు ద్వారా పెన్షన్ హక్కుగా సాధించిన దినానికి గుర్తుగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17 పెన్షనర్స్ డే గా పెన్షనర్ల హక్కుల పరిరక్షణ దినంగా నిర్వహిస్తున్నామని అన్నారు . రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పెన్షనర్లకు ప్రజలకు అనేక రాయితీలు కల్పిస్తామని ఎన్నికల వాగ్దానం చేసి వాటిని అమలు చేయకుండా జాప్యం చేస్తూ ఉద్యోగ పెన్షనర్లను తీవ్ర వేదనలకు గురి చేస్తున్నారని అన్నారు . పెన్షనర్ల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని రెండు లక్షల పెన్షనర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆందోళనకు సిద్ధమవుతుందని ఈ ఆందోళనలో పెన్షనర్స్ మిత్రులంతా పాల్గొనాలని తెలిపారు . కరువు బత్యం పేరు రివిజన్ కమిటీ ప్రయోజనాలు కల్పించకుండా ఉద్యోగ విరమణ చెందిన నాడీ అన్ని ప్రయోజనాలు కల్పిస్తామని తెలిపి నేడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్న తీరుపట్ల పెన్షనర్లు తీవ్ర ఆవేదనతో ఉన్నారని అన్నారు . ఈ సదస్సులో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ ప్రయోజనాలు కల్పించకపోగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ పెన్షనర్లకు ఇబ్బందులు కలిగే చర్యలను చేయటం దురదృష్టకరమని అన్నారు . రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అదే రకంగా రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య కార్డులను అందించి ఆ సేవలను కార్పొరేట్ దవాఖానాలలో అమలు అయ్యే విధంగా చూడాలని కోరారు . జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ వి ఎస్ నర్సింహం మాట్లాడుతూ పెన్షనర్ల ప్రయోజనాలు ఎటువంటి జాప్యం లేకుండా ప్రతి నెల మొదటి తారీకునే పెన్షన్లు విడుదల చేస్తున్నామని వారికి రావలసిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే వాటి విడుదలకు చర్యలు తీసుకుంటామని పెన్షనర్లకు అండగా ఉంటామని తెలిపారు . సబ్ ట్రెజరీ అధికారి మోదుగు వేలాద్రి , సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు వెలిగేటి చంద్రమోహన్ , జిల్లా ఆరోగ్య అధికారి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు . రిటైర్డ్ ఉద్యోగ సంఘ జిల్లా నాయకులు తాళ్లూరి వేణు , టి.జనార్దన్ , సాంబశివరావు , దుర్గాదేవి , రఘుపతి రెడ్డి , కాజా ముయుద్దీన్ , ఎస్.పూర్ణచంద్రావు , సి.బాబురావు , టి.జగన్మోహన్రావు , ఎం.సత్యనారాయణ , ఎన్.కృష్ణమోహన్ , వి.బాబురావు , ఆర్.వెంకటనారాయణ , రమేష్ , రాధాకృష్ణ , హనుమంతరావు , కృష్ణమూర్తి , ఆదినారాయణ , బసవరావు , బాబురావు , ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు . కూతురు కృష్ణమూర్తి , గణపతి రాజు , సత్యానందం తదితరులు పాడిన పాటలు సబికులను ఆనందింప చేశారు . సన్మాన అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా ట్రెజరీ అధికారులను సన్మానించారు . ఈ సదస్సులు జిల్లాలోని 1000 మంది పెన్షనర్లు పాల్గొన్నారు .

## బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పిలుపుమేరకు ఖమ్మంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి పై నిరసన తెలిపిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు...

**-రైతన్నలపై కక్ష సాధింపులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి మారాలంటూ.. అన్యాయమవుతున్న గిరిజన రైతులకు న్యాయం జరగాలంటూ... జడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత...**

**కబురు న్యూస్, ఖమ్మం డిసెంబర్ 17:**

**- లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి సంకెళ్లు వేయటం సిగ్గుచేటు అంటూ నినాదాలు...**

**- ఖమ్మం నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా ఖండించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మరియు ముఖ్య నాయకులు..**

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, ఖమ్మం నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు గారు మాట్లాడుతూ రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం వహిస్తున్న మొండివైఖరిని తీవ్రంగా ఖండిస్తూ : లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలను తీవ్రంగా ఖండిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని





ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. రైతులపై కక్ష వైఖరి అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే తీవ్ర స్థాయిలో బిఆర్ఎస్ పార్టీ గిరిజన రైతుల పక్షాన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాదే అమృత, మక్బుల్, పల్లా రోస్ లీనా ,దండా జ్యోతి అయ్యప్ప రెడ్డి, బుర్రి వెంకట్,మాటేటి నాగేశ్వరావు ,కన్నం ప్రసన్న, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, తెలంగాణ ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, రఘునాథపాలెం మండల అధ్యక్షుడు వీరు నాయక్, గుత్తా రవి బిచ్చల,తిరుమలరావు, డోకుపర్తి సుబ్బారావు, మేకల సుగుణ రావు,మహిళా నాయకురాలు కొల్లు పద్మ, పల్లా రాజశేఖర్ ,పగడాల నరేందర్ ,ST సెల్ నగర అధ్యక్షుడు సురేష్ ,మాజీ కౌన్సిలర్ వంగాల వెంకట్ ,మైనారిటీ నగర అధ్యక్షుడు శంషుద్దీన్, షకీన,పార్టీ నాయకులు చేతి క్రిష్ణ, దానయ్య , అబ్బాస్, బులుసు మురళీకృష్ణ, బోజెడ్ల రాంమోహన్ ,నిరోష,పార ఉదయ్ ,కిషన్ నాయక్ ,వీరేందర్, సద్దాం షేక్, బురాన్ ,ఉస్మాన్, నెమలి కిషోర్, ఆరెంపుల వీరభద్రం , మలుసూర్ ,నారమళ్ళ వెంకన్న ,పాషా, ఫ్రాన్సిస్, వెంకట్,సూత్రాల శ్రీను ,దరిపెల్లి శ్రీను,,ఉదయ్,లింగరాజు ,కిట్టు ,కోటి ,తిరుమల్ ,వెంకట్ ,సైదా హుస్సేన్ ,కుమ్మరి వెంకటేశ్వర్లు ,ఇమాస ,నగేష్ ,శైలేజా,మాదవి ,ఆస్మా ,నాగరాజు ,అనీల్,షెరీఫ్,వీరేశం గౌడ్ ,ఫక్రుద్దీన్,నాగరాజు,ఖాదర్,చింతపల్లి వెంకన్న ,తదితరులు పాల్గొన్నారు

## లక్షలు ఖర్చు పెడితే.. నా కొడుకు శవం గిఫ్టుగా ఇచ్చారు..

**- విద్యార్థి తండ్రి ఎమోషనల్**

**కబురు న్యూస్, హైదారాబాద్ డిసెంబర్ 17:**



హయత్ నగర్ లోని నారాయణ రెసిడెన్షియల్ స్కూల్ లో లోహిత్ అనే ఏడవ తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చదువు ఒత్తిడి తట్టుకోలేక హాస్టల్?లోనే ఫ్యాన్?కు ఉరివేసుకుని సూసైడ్ చేసుకున్నాడు. కొడుకు ప్రయోజకుడు కావాలని నారాయణ పాఠశాలలో చేర్పిస్తే.. ఒత్తిడి తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో మృతుడి తండ్రి కన్నీరుమున్నీరయ్యాడు. కొడుకు చదువు కోసం లక్షలు ఖర్చుపెడితే.. పాఠశాల యాజమాన్యం నా కొడుకు శవం నాకు గిఫ్టుగా ఇచ్చారని విలపించాడు. నారాయణ కాలేజ్ యాజమాన్యం నిర్లక్ష్యం, టీచర్ల వేధింపుల వల్లే నా కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించాడు.నా కొడుకు చనిపోయిన విషయం స్కూల్ యాజమాన్యం ఇప్పటి వరకు నాకు చెప్పలేదని.. పోలీసులు ఫోన్ చేస్తే విషయం తెలిసిందన్నాడు. నా కుమారున్ని చదువు విషయంలో ఎక్కువ టార్చర్ పెట్టొద్దని గతంలోనే చెప్పానని.. అయిన వారు ఒత్తిడి చేయడంతో ఆత్మహత్యకు పాల్పడ్డడాని అన్నారు.విద్యార్థి బాగోగులు పేరెంట్స్ కాకుండా ఇంకా ఎవరికి చెబుతారని.. చనిపోయిన తర్వాత కూడా తమకు సమాచారం ఇవ్వకపోతే ఎలా అని నారాయణ స్కూల్ మేనేజ్మెంట్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. చదువు ఒత్తిడి కాకుండా ఈ స్కూల్ లో ఇంకా ఏదో జరుగుతోందని.. నా కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడా ఇంకా ఏమైనా చేశారా అనే అనుమానం ఉందన్నారు. విద్యార్థుల చావులకు కారణమవుతోన్న నారాయణ స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొడుకు మృతదేహాన్ని చూసి తండ్రి విలపించిన తీరు అక్కడ ఉన్న వారందరి చేత కంటతడి పెట్టించింది. విద్యార్థి సూసైడ్ నేపథ్యంలో మృతుడి కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగే అవకాశం ఉండటంతో స్కూల్ వద్ద పోలీసులు భారీగా భద్రతా పెంచారు.

## జమిలి వెనుక నియంత పాలన కుట్ర

**- కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుంది**
**- ఏడాది పొడవునా శత వసంతాల సంబురాలు..**
**- సిపిఐ సమావేశంలో బాగం హేమంతరావు**

**కబురు న్యూస్, /ఖమ్మం డిసెంబర్ 17:** జమిలి ఎన్నికల వెనుక బిజెపి కుట్ర దాగి ఉందని నియంతృత్వం వైపు మోడీ ఆలోచనలు సాగుతున్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్లు జమిలి ఎన్నికలలో మతోన్మాదం ద్వారా లబ్ధి పొందాలని చూస్తున్నాయని ఇది దేశ ఫెడరల్ స్ఫూర్తికి -విరుద్ధమన్నారు. చింతకాని, కొణిజర్ల మండలాలు, పాలేరు, ఖమ్మం నియోజక వర్గాల సిపిఐ సంయుక్త సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ గడిచిన 11 సంవత్సరాలుగా బిజెపి భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తూనే ఉందని తాము ఈ దేశాన్ని శాశ్వతంగా పాలించాలన్నదే బిజెపి, ఆర్ఎస్ఎస్ల లక్ష్యమని -ఆరోపించారు. భారతదేశం సువిశాల ప్రజాస్వామిక దేశమని విభిన్న మతాల, భాషల, సంస్కృతుల సమ్మేళనమని ప్రాంతానికో భావన ఉండే ఈ దేశంలో జమిలి ఎన్నికలు ప్రజాభిప్రాయాన్ని ప్రస్ఫూటింపచేయలేవన్నారు. ఇప్పటికే -మత చిచ్చుకు తెరలేపిన బిజెపికి దేశ రాజ్యాంగంపై నమ్మకం లేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మారిన రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని హేమంతరావు తెలిపారు. దేశంలో పాలన కార్పొరేట్లు, సంపన్న వర్గాల కోసమే సాగుతుందన్నారు. దేశంలో కమ్యూనిస్టులు బలంగా ఉన్నప్పుడు పేదలు, కార్మికులకు అనుకూలమైన చట్టాలు వచ్చాయని ప్రస్తుతం పేదల కోసం ఉన్న పథకాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా వచ్చినవే అన్నారు. పెరుగుతున్న ఆర్థిక అంతరాలు,



నిర్బంధాలు, సంపన్న అనుకూల శాసనాలు, వ్యవసాయ రంగం సంక్షోభం, కార్పొరేటీకరణ కారణంగా ప్రజలు కమ్యూనిస్టులు బలంగా ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్న భావనలో ఉన్నారని హేమంతరావు తెలిపారు. కమ్యూనిస్టులు బలపడటం చారిత్రిక అవసరమన్నారు. 1925 డిసెంబర్ 26న ఆవిర్భావించిన భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతంలోకి అడుగుపెడుతుందని, శత సంవత్సర సంబురాలను ఏడాది పొడవునా నిర్వహించనున్నట్లు హేమంతరావు తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు, వేలాది మందితో ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. -వంద సంవత్సరాల పోరాట చరిత్ర, సాధించిన విజయాలు, పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేందుకు సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించనున్నామన్నారు. నాటి పోరాట ఘట్టాలను తెలియజేసేందుకు సాహిత్య, సంస్కృతిక రంగాలను వినియోగించుకోనున్నామని హేమంతరావు తెలిపారు. డిసెంబర్ 30న -నల్లగొండలో శత సంవత్సర ప్రారంభ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు ఖమ్మంజిల్లా నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలను తరలించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, -రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, యర్రాబాబు, -ఎస్ కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి -వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీలో చేరుతున్నారనే ప్రచారంపై మంచు క్లారిటీ

## శోభా నాగిరెడ్డి జయంతి సందర్భంగానే ఇక్కడకు వచ్చా : మంచుమనోజ్




కబురు సినిమా డిసెంబర్ 17..

మంచు మనోజ్ రాజకీయాల్లోకి రాబోతున్నాడనే వార్త ఇటీవల వైరల్‌గా మారింది. మంచు ఫ్యామిలీతో విబేధాలు కలకలం రేపుతున్న తరుణంలో మనోజ్ జనసేనలోకి చేరుతాడని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో తన పొలిటికల్ ఎంట్రీపై మంచు మనోజ్ క్లారిటీ ఇచ్చాడు. శోభా నాగిరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం నాడు ఆళ్లగడ్డకు వచ్చిన మంచు మనోజ్.. రాజకీయాల్లోకి రాబోతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై స్పందించారు. పొలిటికల్ ఎంట్రీపై ప్రస్తుతానికి తానేమీ చెప్పలేనంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. మీరు జనసేనలోకి వెళ్లబోతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై ఏం సమాధానం చెబుతారని అడగ్గా.. నో కామెంట్స్ అంటూ నవ్వుతూ వెళ్లిపోయాడు. తన అత్తయ్య శోభా నాగిరెడ్డి జయంతి సందర్భంగా నివాళులు అర్పించేందుకు మాత్రమే ఆళ్లగడ్డకు వచ్చినట్లు మంచు మనోజ్ వివరించారు. తమ కూతురు దేవసేన శోభను తొలిసారిగా ఆళ్లగడ్డకు తీసుకొచ్చామని చెప్పారు. జయంతి రోజునే తీసుకొద్దామనే ఉద్దేశంతో ఇన్నాళ్లు ఇక్కడకు తీసుకురాలేదని తెలిపారు. మా ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలిసి ఇక్కడకు వచ్చారని అన్నారు. తన కోసం ఆళ్లగడ్డకు తరలివచ్చిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# ప్రేమికుల రోజున 'లైలా'



కబురు సినిమా డిసెంబర్ 17..

ప్రేమికుల రోజున 'లైలా'గా సినీప్రియులకు గిలిగింతలు పెట్టనున్నారు విష్వక్ సేన్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ నారాయణ్ తెరకెక్కిస్తున్నారు. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఆకాంక్ష శర్మ కథానాయిక. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సోమవారం ప్రకటించింది. అంతేకాదు నూతన సంవత్సరం రోజున ఫస్ట్ రోజ్ ఆఫ్ లైలా పేరుతో ఫస్ట్‌లుక్ విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ రొమాంటిక్ యాక్షన్ చిత్రంలో విష్వక్ అబ్బాయిగా, అమ్మాయిగా రెండు కోణాలున్న పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. దీనికి లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. రిచర్డ్ ప్రసాద్ ఛాయాగ్రహకుడిగా వ్యవహరిస్తున్నారు.

# తొలసారి నాగచైనత్యను శోభిత అప్పుడే చూసిందంట..!



కబురు సినిమా డిసెంబర్ 17..

టాలీవుడ్ సెలబ్రిటీలు అక్కినేని నాగచైతన్య-శోభిత ధూళిపాళ్ల ఇటీవలే వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారని తెలిసిందే. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ ఇద్దరు తమ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను తాజాగా ఇంటర్వ్యూలో షేర్ చేసుకున్నారు. 2018లో నాగార్జున నివాసంలో నాగచైతన్య-శోభిత తొలిసారి కలిశారట. స్పై సినిమా గూఢచారిలో తన యాక్టింగ్‌కు ఇంప్రెస్ అయి చైతూ నాన్న నాగార్జున ఇంటికి ఆహ్వానించారని చెప్పింది శోభిత. ఇక సోషల్ మీడియాలో ఒకరినొకరు యాడ్ చేసుకున్న వీరిద్దరూ 2022లో మొదటి సారి చిట్ చాట్ చేశారు. ఆహారం పట్ల తమకున్న ఇష్టం, ప్రేమ గురించి నెట్టింట షేర్ చేసుకున్నారు. ఇద్దరూ ఎప్పుడు కలిసినా ఆహారం గురించి చర్చించుకునేవాళ్లమంది శోభిత. చైతూ తనను తెలుగులో మాట్లాడమని ఎప్పుడూ అడిగేవాడని.. తెలుగులో మాట్లాడటం వల్ల తమ రిలేషన్‌షిప్ మరింత బలపడిందని చెప్పింది. ఇక రెండు వారాల తర్వాత నాగ చైతన్య తనతో కలిసి లంచ్ చేయడానికి ఫ్లైట్‌లో ముంబైకి వచ్చాడని శోభిత పేర్కొంది. అది చాలా మనోహరమైన విషయం. నేను నెట్టింట టెక్స్టింగ్ చేసేందుకు.. సోషల్ మీడియాలో కమ్యూనికేట్ చేయడానికి అభిమానిని కాదని.. అమెజాన్ ప్రైమ్ వీడియో ఈవెంట్‌లో తాము మళ్లీ కలుసుకున్నామని.. తాను రెడ్ డ్రెస్‌లో ఉండగా.. చైతూ బ్లూ సూట్‌లో ఉన్నాడంటూ చెప్పుకొచ్చింది చెప్పింది. తాము తొలిసారి ముంబైలోని ఓ కేఫ్‌లో కలుసుకున్నామన్న శోభిత.. అప్పుడు తాను ముంబైలో..నాగచైతన్య హైదరాబాద్‌లో ఉండేవాళ్లమంది. తన కోసం చైతూ తరచూ హైదరాబాద్ నుంచి ముంబైకి వచ్చేవాడని తెలిపింది. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. నాగచైతన్య ఫ్యామిలీ న్యూఇయర్ వేడుకలకు నన్ను ఆహ్వానించారు. ఆ తర్వాతి ఏడాదే చైతన్య తన కుటుంబాన్ని కలిశాడని చెప్పింది శోభిత. ఒకరినొకరు అర్థం చేసుకున్న తర్వాత ఈ ఏడాది గోవాలో పెళ్లి ప్రపోజల్ తీసుకొచ్చినట్టు చెప్పింది.

# బద్లా సీక్వెల్‌కు సన్నాహాలు

కబురు సినిమా డిసెంబర్ 17..

"ప్రతీసారి ప్రతీకారం తీర్చుకోవడం సరికాదు.. అలాగే ప్రతీసారి క్షమించడం కూడా సరైనది కాదు.." అంటూ ప్రేక్షకులను మెప్పించింది 'బద్లా' చిత్రం. 2019లో విడుదలై సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకున్న ఈ సినిమా సీక్వెల్ కోసం ప్రేక్షకులు ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు వారందరికీ ఓ తీపి కబురు వినిపించే ప్రయత్నాల్లో ఉంది చిత్రబృందం. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్‌ను తెరకెక్కించే ఆలోచనల్లో ఉన్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో సుజయ్ ఘోష్ తెరకెక్కించిన ఈ చిత్రంలో తాప్సి కథానాయిక. దీన్ని రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, అజూర్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి.



# స్పిరిట్‌లో మృణాల్..!



కబురు సినిమా డిసెంబర్ 17..

అరంగేట్రం చేసిన అనతికాలంలోనే తెలుగులో మంచి గుర్తింపును సంపాదించుకుంది మరాఠీ భామ మృణల్ ఠాకూర్. సీతారామం, హాయ్ నాన్న చిత్రాల్లో ఈ భామ అభినయానికి ప్రశంసలు లభించాయి. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ హిందీ సినిమాలపై ఎక్కువ దృష్టి పెట్టింది. అక్కడ నాలుగు ప్రాజెక్ట్స్‌లో నటిస్తూ బిజీగా ఉంది. తాజా సమాచారం ప్రకారం ఈ భామ తెలుగులో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. ప్రభాస్ 'స్పిరిట్' చిత్రంలో ఆమె కథానాయికగా నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. సందీప్‌రెడ్డి వంగా డైరెక్ట్ చేయబోతున్న 'స్పిరిట్' మూవీ ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా ఇదే కావడంతో భారీ అంచనాలేర్పడ్డాయి. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. జనవరిలో షూటింగ్ మొదలుకానున్నట్లు సమాచారం. ఈ సినిమాలో కథానాయికగా మృణాల్ ఠాకూర్ ఖరారయ్యే అవకాశాలున్నాయని ముంబయి సినీ సర్కిల్స్‌లో వార్తలొస్తున్నాయి. ఇదే గనుక నిజమైతే మృణాల్ ఠాకూర్ కెరీర్‌లోనే ఇదే అతిపెద్ద ఆఫర్ అవుతుందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి

# టాలీవుడ్ మరింత దగ్గరగా విజయ్‌సేతుపతి

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని విజయ్ సేతుపతి. ఈ స్టార్ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం విడుదల పార్ట్ 2. కోలీవుడ్ దర్శకుడు వెట్రిమారన్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మక్కళ్ సెల్వన్ టీం ప్రమోషన్స్‌లో భాగంగా హైదరాబాద్‌లో సందడి చేసింది. కాగా సైరా నరసింహారెడ్డి సినిమాలో కీలక పాత్రలో నటించిన విజయ్ సేతుపతి.. లీడ్ రోల్‌లో డైరెక్ట్‌గా తెలుగు సినిమా మాత్రం చేయలేదు. ప్రమోషన్స్ సందర్భంగా విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చే విషయంపై క్లారిటీ ఇచ్చాడు. టాలీవుడ్ దర్శకులు సిద్ధం చేసిన కథలను వింటున్నానని.. తెలుగు సినిమా డెబ్యూకు అవకాశముందని హింట్ ఇచ్చేశాడు. టాలీవుడ్ డెబ్యూపై స్పందిస్తూ.. నేను అదే పనిలో ఉన్నా. త్వరలోనే అది జరుగవచ్చన్నాడు విజయ్ సేతుపతి. ఇప్పుడీ కామెంట్స్‌తో అభిమానులు, మూవీ లవర్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇదే నిజమైతే మరి విజయ్ సేతుపతిని తెలుగులో ఎలివేట్ చేసే ఆ దర్శకుడెవరన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. కాగా విడుదల పార్ట్ 2లో సూరి మరో ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. మంజు వారియర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com